
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు జిల్లా వార్తలు
ఆదివారం 28 ఏప్రిల్ 2024

జగన్ మేనిఫెస్టో

తుస్సే!

ఆందోళనలో వైసీపీ వర్గాలు

మూలిగే నక్కపై తాటి కాయ పడ్డట్లు ఉంది వైసీపీ వర్గాల పరిస్థితి. ఇప్పటికే ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉండగా, శనివారం సీఎం జగన్ విడుదల చేసిన మేనిఫెస్టో మరింత నిరాశ పర్చింది. టీడీపీ అధినేత చంద్రబాబు కొన్ని నెలల కిందట ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో పోల్చుకుని వైసీపీ వర్గాలే పెదవి విరుస్తున్నాయి. సంక్షేమ పథకాల లబ్ధి జగన్ కన్నా చంద్రబాబు అధికారంలోకి వస్తేనే ఎక్కువగా ఉంటుందన్న అభిప్రాయం ఏర్పడుతోంది. గత ఐదేళ్లకన్నా అధికంగా ప్రయోజనం ఉంటుందని పెన్షనర్లు, రైతులు, మహిళలు ఆశపడ్డారు. జగన్ వారి ఆశలు భగ్నం చేశారు. జగన్ మేనిఫెస్టో నేపథ్యంలో ఆయా వర్గాలకు జరిగే మేలు, నష్టం తీరు ఇలా ఉంటుంది.. - చిత్తూరు, ఆంధ్రజ్యోతి



పెన్షన్లు

చంద్రబాబు హామీ: అధికారంలోకి రాగానే అన్ని వర్గాలకూ పెన్షన్ రూ.4000లు చేస్తాం. ప్రస్తుతం రూ.3000లు పెన్షన్ పొందుతున్నవారికి ఏప్రిల్ నుంచే పెంచిన రూ.1000లు కూడా చెల్లిస్తాం.


జగన్ మేనిఫెస్టో: పెన్షన్‌లు 2028లో రూ.250లు, 2029లో మరో రూ.250లు పెంచుతాం.

జగన్ వల్ల రూ.1640 కోట్ల నష్టం



చంద్రబాబు ఇస్తానన్న నాలుగువేల పెన్షన్‌తో పోలిస్తే జగన్ అధికారంలోకి వస్తే జిల్లాలోని 2,74,146 మంది పెన్షన్‌దారులు నెలకు రూ.వెయ్యి చొప్పున నష్టపోనున్నారు. జిల్లాలోని పెన్షన్‌దారులు నెలకు రూ.27.41 కోట్లు.. ఏడాదికి రూ.328 కోట్లు.. ఐదేళ్లకు రూ.1640 కోట్లు నష్టపోనున్నారు. ఒక్కో పెన్షన్‌దారు వచ్చే ఐదేళ్లలో రూ.60 వేలు నష్టపోతారు.

గతంలో: జగన్ అధికారంలోకి వచ్చేటప్పటికి పెన్షన్ రూ. 2000 ఉంది. అంతకుముందు టీడీపీ అధికారం చేపట్టినపుడు కేవలం రూ. 200 మాత్రమే ఉండేది. దానిని చంద్రబాబు రూ.2000కి పెంచారు. జగన్ అధికారంలోకి వచ్చాక అవ్వాతాతలకు రూ.3000 చేస్తానని చెప్పి అంచలంచెలుగా రూ.250 వంతున పెంచి రూ.3000లు చేశారు.



సిలిండర్లు

చంద్రబాబు హామీ: టీడీపీ అధికారంలోకి వస్తే ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లను ప్రతి ఇంటికీ ఉచితంగా ఇస్తాం.

జగన్ మేనిఫెస్టో: ఉచితంగా సిలిండర్లు ఇచ్చే ఆలోచనే లేదు.



టీడీపీ వస్తే సిలిండర్ల రూపంలో రూ.15 వేల లబ్ధి

చంద్రబాబు అధికారంలోకి వస్తే సగటున ఒక సిలిండర్ ఖరీదు రూ.వెయ్యి అనుకుంటే ఏడాదికి ఒక్కో కుటుంబానికి రూ.3 వేలు లబ్ధి కలుగుతుంది. ఐదేళ్లలో రూ.15 వేల లబ్ధి కలుగుతుంది. జిల్లాలో 5.45 లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయి. వారందరికీ ఏడాది రూ.163 కోట్ల విలువ చేసే సిలిండర్లను ఉచితంగా చంద్రబాబు అందించనున్నారు. ఇందువల్ల జిల్లాలోని పేదలకు టీడీపీ అధికారంలోకి వస్తే ఐదేళ్లలో రూ.815 కోట్లు లబ్ధి చేకూరనుంది.


రైతులకు

చంద్రబాబు హామీ: అధికారంలోకి రాగానే అన్నదాత పథకం కింద ఒక్కొక్కరికి రూ.20 వేలు వంతున ఇస్తాం.

జగన్ మేనిఫెస్టో: రైతు భరోసాను రూ.16 వేలుకు పెంచుతాం.

462 కోట్ల నష్టం

జిల్లాలో 2,31,144 మంది రైతులున్నారు. ఇప్పుడిస్తున్న రూ.13,500 రైతు భరోసాను రూ.16 వేలుగా పెంచి ఇస్తామని జగన్ మేనిఫెస్టోలో ప్రకటించారు. చంద్రబాబు హామీతో పోలిస్తే ప్రతి రైతు ఏడాదికి రూ.4 వేలు నష్టపోతారు. ఐదేళ్లకు రూ.20 వేలను నష్టపోతారు. జిల్లాలోని రైతులందరికీ రూ.462 కోట్ల నష్టం కలుగుతుంది. **గతంలో:** రైతులకు రూ.14 వేలు ఇస్తానని గతంలో చెప్పిన జగన్.. రూ.13500 ఇస్తున్నారు. అందులో రూ.6 వేలు కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్ యోజన నిధులే. అంటే జగన్ ఇచ్చేది రూ.7,500 మాత్రమే.



ఆర్టీసీలో ఉచితం



చంద్రబాబు హామీ: అధికారంలోకి రాగానే ప్రతి మహిళకూ ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం

జగన్ మేనిఫెస్టో: ప్రస్తావనే లేదు


చంద్రబాబు వస్తేనే మహిళలకు బస్సుల్లో ఉచితం

జిల్లాలో సుమారు 11 లక్షల మంది మహిళలున్నారు. వీరిలో ఉద్యోగ, ఉపాధి వంటి ఇతర పనుల కోసం నిత్యం ప్రయాణించేవారు లక్ష మంది ఉంటారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణమంటూ సూపర్‌సిక్స్ పథకాల్లో ప్రకటించేసింది. వైసీపీ ఈ విషయాన్ని పట్టించుకోలేదు. ఇప్పటికే కర్ణాటక, తమిళనాడు తాజాగా తెలంగాణ రాష్ట్రాల్లో ఈ ఉచిత ప్రయాణ పథకం విజయవంతంగా అమలవుతోంది.

చదువుకు భరోసా

చంద్రబాబు హామీ: టీడీపీ అధికారంలోకి వస్తే అమ్మకు వందనం పేరుతో ఇంట్లో ఎందరు పిల్లలున్నా ప్రతి పిల్లాడికీ రూ.15 వేలు చొప్పున అందిస్తాం.

జగన్ మేనిఫెస్టో: అమ్మఒడిని రూ.17లు వేలకు పెంచుతాం.



బాబు వస్తేనే పిల్లలందరికీ చదువులు

ప్రస్తుతం జగన్ ప్రభుత్వంలో ఒక ఇంట్లో ఒక్కరికి మాత్రమే అమ్మఒడి పథకం కింద రూ.13వేలు చెల్లిస్తున్నారు. నిజానికి ఇంట్లో ఎందరు పిల్లలున్నా రూ.15 వేలు ఇస్తామని అధికారంలోకి రాకముందు చెప్పిన జగన్, ఆ తర్వాత ఒక్కరికి మాత్రమే రూ.15 వేలు ఇస్తామని బేరం పెట్టారు. చివరికి అందులోనూ నిర్వహణ ఖర్చులంటూ కత్తిరించి రూ.13 వేలు మాత్రమే ఖాతాల్లో వేస్తున్నారు. అదీ నాలుగేళ్లే చెల్లించారు. 2024కి సంబంధించిన మొత్తం జమ చేయనే లేదు. ఇప్పుడు దానిని రూ.17 వేలు చేస్తామని చెబుతున్నా అధికారంలోకి వచ్చాక అంతే ఇస్తారన్న నమ్మకం జనంలో లేదు. చంద్రబాబు రూ.15 వేలు ఇస్తానని చెప్పినా ఇదే ఎక్కువ ప్రయోజనకరం. సగటున ఒక ఇంట్లో ఇద్దరు పిల్లలుంటారని భావిస్తే ప్రతి కుటుంబానికీ రూ.30 వేల లబ్ధి చేకూరుతుంది.

న్యాయ వ్యవస్థకు మారుపేరు చిత్తూరు

న్యాయవాదులు అంకితభావంతో ముందుకెళ్లాలి ● సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గవాయి




కోర్టు భవన సముదాయం ప్రారంభోత్సవంలో న్యాయమూర్తులు - కోర్టు భవన సముదాయం

చిత్తూరు లీగల్, ఏప్రిల్ 27: చిత్తూరు న్యాయ వ్యవస్థకు మారుపేరని, ప్రజలకు దానిపై నమ్మకం కలిగేలా న్యాయవాదులు అంకితభావంతో ముందుకెళ్లాలని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ గవాయి అన్నారు. చిత్తూరులో రూ.40 కోట్లతో నిర్మించిన 15 కోర్టు భవనాల సముదాయాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ జిల్లా నుంచి ఎంతో మంది విశిష్టమైన వ్యక్తులు న్యాయ వ్యవస్థకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. న్యాయవాదులు నిజాయితీ, ధైర్యం, అంకితభావంతో కష్టపడి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. జస్టిస్ ఎస్‌వీఎస్ భట్టి మాట్లాడుతూ న్యాయవ్యవస్థ ప్రతిష్ట పెంచేలా న్యాయవాదులు పనిచేయాలన్నారు. హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాగూర్ మాట్లాడుతూ కోర్టు భవనాల ప్రారంభోత్సవానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తులు రావడం ఆనందంగా ఉందన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు న్యాయమూర్తులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అంతకు ముందు కలెక్టర్ షన్మోహన్, ఎస్పీ మణికంఠ చందోలు, చిత్తూరు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో వారికి ఘనంగా స్వాగతం పలికారు. శాలువలు, గజమాలలు, పోలీసు గౌరవ వందనాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి, చిత్తూరు అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ రావు రఘునందరావు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి తిరుపతి డివిజన్ విజయసారథిరాజు, చిత్తూరు, తిరుపతి, నగరి, మదనపల్లె, పుంగనూరు కోర్టుల న్యాయమూర్తులు, ఏపీ బార్‌కౌన్సిల్ ఛైర్మన్ నల్లారి ద్వారకనాథరెడ్డి, చిత్తూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఏం చేశారని మా ఊరికొచ్చారు?

● కొత్తవెంకటాపురంలో నారాయణస్వామిని నిలదీసిన మహిళలు

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 27: 'మా ఊరికి ఏం చేశారని ఓట్లు అడిగేదానికోసం వచ్చారు' అంటూ మండలంలోని కొత్తవెంకటాపురం గ్రామంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామిని మహిళలు నిలదీశారు. శనివారం ఆయన మండలంలోని పాతపాళ్యం, కొత్తవెంకటాపురం, పాతవెంకటాపురం పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొత్తవెంకటాపురం గ్రామంలో ప్రచార వాహనంలో వెళుతూ ఓట్లు వేయాలని కోరడంతో కొంత మంది మహిళలు కలుగజేసుకుని 'ఎన్నికలు రావడంతో ఇప్పుడు గుర్తు వచ్చామా.. మావూరిలో తాగునీటి సమస్య పరిష్కరించలేదు.. రైతుభరోసా, చేయూత డబ్బులు పడలేదు..' అని అనడంతో అసహనానికి గురయ్యారు. 'మీకు ఏ పథకమూ అందలేదా.. గ్రామానికి చెందిన బాబునాయుడు వైసీపీ నుంచి మీ పార్టీలోకి (టీడీపీలోకి) మారిపోయారనే కారణంతోనే నన్ను నిలదీస్తారా' అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.



ఉదయ్ కుమార్ ఇంట్లో..

ఈశ్వర్ ఇంట్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు



షణ్ముగం నివాసంలో..



టీడీపీ బీసీ నేతలే టార్గెట్

● మద్యం, నగదు ఉన్నాయంటూ తనిఖీలు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 27: టీడీపీ బీసీ నేతలే టార్గెట్‌గా వారి ఇళ్లలో ఎన్నికల అధికారులు, పోలీసులు శనివారం తనిఖీలు నిర్వహించారు. మద్యం, నగదు ఉందన్న అనుమానంతో తనిఖీలు నిర్వహించారు. సంతపేటలో చిత్తూరు కో ఆపరేటివ్ బ్యాంక్ మాజీ ఛైర్మన్, టీడీపీ సీనియర్ నేత పి.షణ్ముగం, టీడీపీ చిత్తూరు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ఆర్.ఈశ్వర్ (ఆయన సతీమణి ఆర్.రతీదేవి టీడీపీ మాజీ కార్పొరేటర్), 47వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి ఉదయ్‌కుమార్ నివాసాల్లో తనిఖీలు చేసి, ఏమీ దొరక్కపోవడంతో వెనుదిరిగారు. టీడీపీకి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక వైసీపీ నేతలు కావాలనే తమపై అసత్య ప్రచారం చేసి, పోలీసులతో సోదాలు నిర్వహించి అవమానపరచారని విమర్శించారు. ప్రజలే వారికి తగిన గుణపాఠం చెబుతారన్నారు.

బుజ్జగింపులు షురూ..!

రేపు నామినేషన్ల ఉపసంహరణకు గడువు

నేడు సెలవు - చిత్తూరు అసెంబ్లీకి ఒకటి విత్‌డ్రా

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 27: నామినేషన్ల ఉపసంహరణకు ఆదివారం సెలవు కావడం, సోమవారం ఒక రోజు మాత్రమే సమయం ఉండడంతో ఎన్నికల బరిలో నిలిచిన చిన్న చిన్న అభ్యర్థులను పోటీ నుంచి విరమింపజేసేందుకు ప్రధాన పార్టీల నాయకులు బుజ్జగింపులు మొదలుపెట్టారు. వారి స్నేహితులు, బంధువులు, కింది స్థాయి నేతలతో చెప్పించి పోటీ నుంచి తప్పించాలని చూస్తున్నారు. ప్రయత్నాలు సఫలమైతే సోమవారం 50శాతం మంది నామినేషన్లను ఉపసంహరించుకునే అవకాశముంది. కాగా, నామినేషన్ల ఉపసంహరణ శనివారం కొనసాగింది. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఇండిపెండెంట్ అభ్యర్థి ఎంవీ ఇందుమతి తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. చిత్తూరు పార్లమెంటు స్థానంతోపాటు మిగిలిన ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఒక్కటి కూడా ఉపసంహరణ జరగలేదు. ఆదివారం సెలవు కావడంతో ఉపసంహరణ పత్రాలు స్వీకరించరు. సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణ ప్రక్రియ కొనసాగుతుంది. ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా విత్‌డ్రా కాగితాలు తీసుకోరు. ప్రస్తుతం చిత్తూరు పార్లమెంటు స్థానానికి 21 మంది, అసెంబ్లీ స్థానాలకు నగరి - 07, గంగాధరనెల్లూరు - 12, చిత్తూరు -13, పూతలపట్టు- 12, పలమనేరు- 14, కుప్పం-15, పుంగనూరులో - 10 మంది అభ్యర్థులు వెరసి 104 మంది బరిలో ఉన్నారు.

రామచంద్రయాదవ్‌తోపాటు 14మంది బీసీవైపీ నేతలపై కేసు

ముగ్గురు వైసీపీ నేతలపై కూడా..

మాగాండ్లపల్లె ఘటనలో పోలీసుల చర్యలు

పుంగనూరు, ఏప్రిల్ 27: పుంగనూరు మండలం మాగాండ్లపల్లెలో శుక్రవారం బీసీవై పార్టీ రోడ్‌షో సందర్భంగా జరిగిన దాడిఘటనలో ఆ పార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్‌తోపాటు మరో 13మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బీసీవై పార్టీ కరపత్రాలు తీసుకోలేదని తమపై దాడి చేశారని వైసీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రామచంద్రయాదవ్, కుమార్, నారాయణస్వామి, నాగభూషణం, శంకర్, శివ, సురేంద్ర, గోపాల్, గోపి, శ్రీనివాసులు, చంద్రశేఖర్, మణి, నాగరాజు, మంజునాథ్‌లపై కేసు నమోదు చేశారు. అలాగే బీసీవై పార్టీ నాయకులపై దాడి చేసి, వాహనం అద్దాలు ధ్వంసం చేశారని ఆ పార్టీ నేత నారాయణస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైసీపీ కార్యకర్తలు శశి భూషన్‌రెడ్డి, కొండప్ప, శ్రీనులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహ్మమద్‌రఫీ తెలిపారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా బాధితులపైనే పోలీసులు తప్పుడు కేసులు బనాయించారని రామచంద్ర యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

రేపు చిత్తూరుకు బాలకృష్ణ రాక

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 27 : టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సోమవారం చిత్తూరుకు రానున్నారు. స్వర్ణాంధ్ర సాకార యాత్రలో భాగంగా వస్తున్నట్లు చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ కార్యాలయం నుంచి శనివారం ఒక ప్రకటన వచ్చింది. మురకంబట్టు నుంచి ర్యాలీగా గాంధీ విగ్రహం కూడలికి చేరుకుంటారని, అక్కడ బహిరంగ సభలో మాట్లాడతారని పేర్కొన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట భద్రత



స్ట్రాంగ్ రూములను పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు, ఏప్రిల్ 27: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. శనివారం నగర శివారులోని ఎస్వీసెట్‌లో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూములను ఆయన పరిశీలించారు. భద్రత, బందోబస్తు ఏర్పాట్లపై పోలీసు అధికారులకు పలు సూచనలిచ్చారు. కేంద్ర బలగాలతో సమన్వయం చేసుకుని అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏఎస్పీ అరీఫుల్లా ఆయన వెంట ఉన్నారు.

వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి



బంగారుపాళ్యం, ఏప్రిల్ 27: చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని గుండ్లకట్టమంచి వద్ద వాహనం ఢీకొని శుక్రవారం రాత్రి ఓ వృద్ధురాలు మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు.. గుర్తు తెలియని వృద్ధురాలు గుండ్లకట్టమంచి వద్ద రోడ్డు పక్కన నడిచి వెళుతుండగా శుక్రవారం అర్ధరాత్రి బెంగళూరు నుంచి చిత్తూరు వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలు ఎర్ర చీర, పసుపు రంగు జాకెట్ ధరించి ఉంది. మృతదేహాన్ని బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రి మార్చురీలో ఉంచామని, వివరాలు తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలని కోరారు.

చెరువులో పడి బాలుడి మృతి



మృతి చెందిన జగదీశ్

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 27 : పశువులను కడుగుతూ చెరువులో పడి బాలుడు మృతిచెందిన ఘటన శనివారం పుంగనూరు మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని ఏటవాకిలి పంచాయతీ ప్రసన్నయ్యగారిపల్లెకు చెందిన నారాయణ కుమారుడు జగదీశ్(11) 7వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో గ్రామ సమీపంలోని చెరువులో పశువులను కడుగుతూ కాలుజారి నీటిలో పడిపోయాడు. కొంతసేపటికి గుర్తించిన తల్లిదండ్రులు పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు.

వేసవిలో పంటలను సంరక్షించడం ఎలా?

- వ్యవసాయ శాఖ సూచనలు

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 27: వేసవిలో ఉష్ణోగ్రతలు, వేడిగాలుల నుంచి పంటలను కాపాడుకోవడంపై జిల్లా వ్యవసాయ శాఖ శనివారం పలు సూచనలు చేసింది. రబీ సీజన్ మొదలైన నేపథ్యంలో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ప్రధానంగా వరి మే మొదటి, రెండు వారాల్లో కోతకు వచ్చే అవకాశముంది. ఎండలకు గింజ పగిలి, విరిగిపోకుండా తేమ ఒత్తిడిని నివారించాలి. గింజలు పక్వానికి వచ్చిన వెంటనే కోత కోయాలి. రెండో ప్రధాన పంట వేరుశెనగకు ముఖ్యమైన దశలలో నీటిని ఎక్కువ సార్లు అందించాలి. మట్టిలో తేమశాతం సంరక్షించుకోవాలి. స్ప్రింక్లర్ల ద్వారా నీటిని అందించడం ప్రయోజనకరం. చెరకు నాటడానికి పరిపక్వ ముచ్చెలను ఉపయోగించాలి. లోతుగా నాటాలి. తేమను కాపాడుకోవాలి. కలుపు మొక్కలు ఉండకుండా చూసుకోవాలి. చద పురుగులు కనిపించిన చోట మల్చింగ్ చేయకూడదు. పొగాకు, పత్తి, మినుము, పెసర, కంది, నువ్వులు, రాగులు, జొన్న, మొక్కజొన్న పంటలకు తరచుగా నీటి తడులు ఇవ్వాలి. వేసవిలో పంటలకు సోకే తెగుళ్ల నివారణకు మండల వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు.

కొండలకు గుండు..!

- జీడీనెల్లూరు నియోజకవర్గంలో అంతులేని ఆక్రమణలు
- చదును అవుతున్న గుట్టలు



వెదురుకుప్పం మండలం కొమరగుంట రెవెన్యూ లెక్కదాఖలాలో కొండను చదును చేశారిలా

అవినీతి మచ్చ తనలో వెతికినా కనబడదని చెబుతారు. విపక్షాలకు సవాళ్లు విసురుతారు. లంచం అడిగారో ఖబడ్దార్ అంటూ అధికారులను హెచ్చరిస్తుంటారా నాయకుడు. ఆ నాయకుడి పేరు చెప్పి కొందరు కొండలు, గుట్టలను చదును చేసేస్తున్నారు. మొక్కలు నాటి ఆక్రమించేస్తున్నారు. అధికారులూ చూసీచూడనట్లు ఉండిపోతున్నారు. ఇలా గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో కొండలన్నీ చదును అవుతున్నాయి. ఈ ఐదేళ్లలో ఇలా అంతులేని ఆక్రమణలు జరిగినా.. పట్టించుకునే వారే లేకపోయారు.

- వెదురుకుప్పం

- గంగాధరనెల్లూరు మండలం కొండేపల్లె రెవెన్యూ గ్రామ సమీపంలోని గుట్టలు ఒకటొకటీ కరిగిపోతున్నాయి. పోలినాయుడుపల్లె నుంచి చింతారెడ్డిపల్లెకు వెళ్లే దారిలో పక్కనున్న గుట్ట కరిగింది. చిత్తూరు-పుత్తూరు ప్రధాన రహదారిలోని కొండేపల్లె పంచాయతీ పద్మాపురం బస్టాప్ దగ్గర ఆక్రమణలు జరిగాయి.



గంగాధరనెల్లూరు మండలం పద్మాపురం వద్ద..

- కార్వేటినగరం మండలంలో ఎక్కడ కొండలు, గుట్టలు కనిపించినా నాయకులు చదును చేసి మొక్కలు నాటేస్తున్నారు. ఆళత్తూరు సమీపంలోని భువనేశ్వరి గుట్టను ఇలా ఆక్రమించారు. విజయమాంబాపురం దగ్గర గుట్టను చదును చేస్తున్నారు.



కార్వేటినగరం మండలం విజయమాంబాపురం వద్ద ఇలా..

- వెదురుకుప్పం మండలంలోనూ గుట్టలను చదును చేశారు. రెవెన్యూ క్షేత్రస్థాయి ఉద్యోగుల అండదండలతో జరగాల్సిందంతా జరిగిపోయిందన్న ప్రచారం జోరందుకుంది. చెరువులు, శ్మశాన స్థలాలు, దారులను సైతం ఈ మండలంలో ఆక్రమించుకున్న ఘటనలు ఉన్నాయి. ఈ మండలంలో చాలా చోట్ల ఆక్రమణలు జరిగాయి. కానీ, కొన్ని చోట్ల ఫిర్యాదు రావడంతో యంత్రాంగం బోర్డులు పెట్టారు.

వెదురుకుప్పం మండలం జక్కిదొన ప్రాంతంలో పాండురాజు గుట్టను సుమారు 16.23 ఎకరాల్లో ఆక్రమించారు. ఆ ప్రాంతంలోనే సర్వే నెంబరు 828లో 7.22 గుంటలున్న గుట్ట కూడా ఆక్రమణలకు గురైంది. ఆ ప్రాంతంలోనే ఎలువల గుట్టనూ చెరబట్టారు. కొమరగుంట రెవెన్యూ లెక్కదాఖలాల్లో సర్వేనంబరు 269 తదితర చోట్ల గుట్టను చదును చేశారు.

హెచ్చరిక బోర్డులతో సరి

వెదురుకుప్పం మండలంలో చాలా చోట్ల ఆక్రమణలు జరిగాయి. కొన్ని చోట్ల ఇది ప్రభుత్వ భూమి.. ఎవరూ ప్రవేశించరాదంటూ బోర్డులు పెట్టి చేతులు దులుపుకొన్నారు.

- కేవీఎం అగ్రహారం రెవెన్యూ లెక్కదాఖలాల్లో సర్వే నంబరు 179/2లో 76 సెంట్ల గుట్ట పొరంబోకు భూమికి బోర్డు పెట్టారు. 167/8లో రోడ్డు ఆక్రమణకు గురైతే 96 సెంట్ల భూమికి పెట్టారు. 166/1 దిబ్బపొరంబోకు భూమి 1.25 సెంట్లకు ప్రభుత్వ భూమి బోర్డును ఏర్పాటు చేశారు.
- కురివికుప్పంలో గ్యాప్ ఏరియాలో రెండు ఎకరాల భూమి ఆక్రమణకు గురైతే బోర్డు పెట్టించారు.
- బ్రాహ్మణపల్లె రెవెన్యూ లెక్కదాఖలాల్లో సర్వే నంబరు-14లో 2.42 సెంట్ల దారి భూములను ఆక్రమిస్తే బోర్డు ఏర్పాటు చేశారు. సర్వే నంబర్లు-20/12,20/13లో 19 ఎకరాల నాగిరెడ్డి చెరువును ఆక్రమించుకున్నారు. దీంతో అక్కడ యంత్రాంగం బోర్డు పెట్టింది. సర్వే నెంబరు 22లో 70 సెంట్ల దారిని ఆక్రమించుకుంటే బోర్డు పెట్టారు.
- జక్కిదొన రెవెన్యూలో సర్వే నంబరు 468/2 కుంట పొరంబోకు 4 ఎకరాల భూముల్లో ఆక్రమణ జరిగితే బోర్డు పెట్టారు. 787 సర్వేనంబరులో 69 ఎకరాలు గుట్ట పొరంబోకు ఉంటే 19 ఎకరాల వరకు ఆక్రమణలకు గురైందని ఫిర్యాదుల మేరకు రెవెన్యూ గుర్తించింది. అక్కడా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. 769 సర్వే నంబరులో రెండు ఎకరాలు కబ్జా జరిగితే బోర్డు పెట్టించారు.
- ఆళ్లమడుగు సర్వే నంబరు ఒకటిలో ఐదు ఎకరాలు ఆక్రమణలకు గురైతే బోర్డు పెట్టారు.
- పచ్చికాపల్లంలో సర్వే నంబరు 237లో కల్లం పొరంబోకు భూమి 3.47 ఎకరాల్లో ఆక్రమణలకు గురైతే అక్కడ బోర్డును ఏర్పాటు చేశారు. సర్వే నంబరు 68/1లో 4.30 ఎకరాల్లో గుట్ట పొరంబోకు భూములు ఆక్రమణలకు గురైనట్లు బోర్డు పెట్టారు.
- మొండివెంగనపల్లె రెవెన్యూ లెక్కదాఖలాల్లో సర్వే నంబరు -183లో ఐదు ఎకరాల భూమిలో ఆక్రమణలు చోటుచేసుకున్నాయని బోర్డు పెట్టారు. అలాగే సర్వే నంబరు 179/9లో శ్మశానానికి 1.50 ఎకరాలు ఉండగా అక్కడా ఆక్రమణలు చోటుచేసుకున్నాయని రెవెన్యూ యంత్రాంగం బోర్డు ఏర్పాటు చేయడంతో సరి.

మొదలైన మహాభారత ఉత్సవాలు

జీడీ నెల్లూరు నియోజకవర్గంలో ప్రత్యేక గుర్తింపు - 11 నుంచి 13 రోజులపాటు నిర్వహణ

వెదురుకుప్పం, ఏప్రిల్ 27: జిల్లాలో మహాభారత ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్వేటినగరం మండలం అమ్మపల్లి, వెదురుకుప్పం మండలం మొరవ గ్రామంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. ఎస్ఆర్‌పురం మండలం కొత్తపల్లిమిట్టలో ఉత్సవాలు ముగిశాయి. వెదురుకుప్పం మండలం జక్కిదొనలో ఈనెల 29న ఉత్సవాలకు స్వీకారం కొడి కార్యక్రమం చేపట్టనున్నారు. జీడీనెల్లూరు నియోజకవర్గంలో ఈ ఉత్సవాలు పెద్దయెత్తున నిర్వహిస్తారు. ఇక్కడ శ్రీకృష్ణ ద్రౌపదీ ధర్మరాజుల ఆలయాలు ఎక్కువగా ఉన్నాయి. ఏటా ఏప్రిల్ నుంచి సెప్టెంబరు మధ్యలో ఈ ఉత్సవాలు జరుపుతారు. గతంలో ఒక్కొక్క ఆలయంలో 45 రోజులపాటు నిర్వహించేవారు. కాలక్రమేణా 11 నుంచి 13 రోజులకు కుదించారు. గ్రామీణ కళాకారులు మహాభారత యజ్ఞంలోని 18 ఘట్టాలకు సంబంధించి పగలు హరికథ, రాత్రి సమయాల్లో వీధి నాటకం రూపంలో ప్రదర్శిస్తారు. ఉత్సవాల రోజుల్లో ఆలయంలోని ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేసి, ఊరేగిస్తారు. ద్వాపర యుగంలో ధర్మం మూడు పాదాలు, అధర్మం ఒక పాదంలో నడుస్తుండడం పాండవులు, కౌరవుల పోరుకు నాంది పలికింది. కలియుగంలో ధర్మం ఒక పాదం, అధర్మం మూడు పాదాలపై నడుస్తున్నందున ప్రజలకు ధర్మకర్మాలు, సత్యఅసత్యాలు తెలియజేసి, ఎలా జీవించాలో తెలియజేసేందుకే మహాభారతం ఉత్సవాలు జరుగుతున్నాయని పెద్దలు అంటుంటారు.





మొరవ గ్రామంలో ప్రత్యేక అలంకరణలో ద్రౌపదీ అమ్మవారు - దుర్యోధన వధ సన్నివేశాలు(ఫైల్ ఫొటో)

పుంగనూరు న్యాయమూర్తుల బదిలీ



బదిలీ అయిన న్యాయమూర్తులు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 27 : పట్టణంలోని రెండు కోర్టుల న్యాయమూర్తులను బదిలీ చేస్తూ హైకోర్టు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కార్తీక్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సింధులను విశాఖపట్నం కోర్టుకు బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. భార్యాభర్తలపై వీరిద్దరికీ పుంగనూరు న్యాయవాదులు వీడ్కోలు పలికారు.

వరసిద్ధుడి సేవలో కర్ణాటక లోకాయుక్త



జస్టిస్ పాటిల్‌కు ప్రసాదం అందిస్తున్న ఏఈవో కృష్ణారెడ్డి

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 27: కర్ణాటక లోకాయుక్త జస్టిస్ బీఎస్. పాటిల్ శనివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఏఈవో ఎస్వీకృష్ణారెడ్డి ఆలయ మర్యాదలతో ఆయన్ను ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో వేద మంత్రాలతో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్లు రమేష్, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ



క్యూలో వేచి ఉన్న భక్తులు

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 27: వేసవి సెలవుల నేపథ్యంలో శనివారం కాణిపాకం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఉదయం నుంచి వరసిద్ధుడి దర్శనం కోసం భక్తులు ఆలయానికి విచ్చేశారు. దీంతో క్యూలన్నీ పూర్తిగా నిండిపోయాయి. దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టింది. క్యూలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. రద్దీ రాత్రి వరకు కొనసాగింది.

బైండోవర్ ఉల్లంఘించిన ముగ్గురికి జరిమానా

సోమల, ఏప్రిల్ 27: బైండోవర్ ఉల్లంఘించిన ముగ్గురికి జరిమానా విధించినట్లు ఎస్ఐ సీవీ నరసింహులు తెలిపారు. శాంతి భద్రతలు, షూరిటీ బాండ్ల నియమాలను ఉల్లంఘించిన ముగ్గురిని తహసీల్దార్ నాగరాజ ఎదుట హాజరుపరచగా ఇద్దరికి రూ.15వేల చొప్పున, మరొకరికి రూ.10 వేలు జరిమానా విధించినట్లు చెప్పారు.

టీడీపీ మండలాధ్యక్షుడిపై వైసీపీ దాడి

- రాడ్లు, రాళ్ల దాడిలో కారు అద్దాలు ధ్వంసం
- పిరికిపంద చర్యలు మానుకోవాలి ● చల్లా రామచంద్రారెడ్డి



వైసీపీ నేతల దాడిలో పగిలిపోయిన రమేశ్‌రెడ్డి కారు అద్దాలు

పుంగనూరు, ఏప్రిల్ 27: 'మా పంచాయతీకి ఎందుకు వచ్చావ్' అని వైసీపీ నేతలు చౌడేపల్లె టీడీపీ మండల అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి)పై రాడ్లు, రాళ్లతో దాడి చేశారు. ఈ సంఘటన బోయకొండ ఆర్చి వద్ద జరిగింది. బాధితుడి కథనం మేరకు.. శనివారం రాత్రి బోయకొండ క్రాసు వద్ద టీడీపీ కార్యకర్త జన్మదిన వేడుకలకు రమేశ్‌రెడ్డి, మరికొందరు కార్యకర్తలు వెళ్లారు. తర్వాత ఇళ్లకు తిరుగుప్రయాణ మయ్యారు. ఈ క్రమంలో రమేష్‌రెడ్డికి చెందిన ఇన్నోవా కారు ఏపీ04ఆర్ 2929ను వైసీపీ నాయకుడు లడ్డూల రమణ మరికొంతమంది అడ్డుకున్నారు. మా పంచాయతీకి ఎందుకు వచ్చావంటూ ఒక్కసారిగా రాడ్లు, రాళ్లతో దాడి చేశారు. ఇన్నోవా అద్దాలు పగిలిపోయాయి. రమేష్‌రెడ్డిని రాళ్లతో కొట్టారు. చంపేస్తామని బెదిరించారు. మిగిలిన కార్యకర్తలు పారిపోయారు. తర్వాత రమేష్‌రెడ్డి ధ్వంసమైన కారును చౌడేపల్లె పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. దాడిపై ఫిర్యాదు చేశారు. లడ్డూల రమణతోబాటు రఘుపతి, శ్రీనివాసులునాయుడు, మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, మునికృష్ణమనాయుడు, పాల గంగిరెడ్డి, విశ్వనాథ నాయుడు, కె.మోహన్, ప్రసాద్, దొరబాబు, లోకేశ్, ప్రసాద్ నాయుడు, చరణ్, ఈశ్వరయాదవ్, నైట్ వాచ్‌మ్యాన్ చరణ్ తదితరులు దాడికి పాల్పడ్డారని ఫిర్యాదు చేశారు. తనకు, తమ కార్యకర్తలకు వైసీపీ నేతల నుంచి ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని కోరారు.

వైసీపీ పిరికిపంద చర్య

వైసీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ప్రజలు ఎన్నికల్లో ఓడిస్తారనే భయంతో టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రెడ్డిపై దాడి జరిగిందని అది పిరికిపంద చర్య అని టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. త్వరలోనే పుంగనూరులో వైసీపీ అరాచకపాలనకు అంతం పలుకుతామని ఈ దాడిని ఖండించారు.

వైభవంగా సంకటహర గణపతి వ్రతం

స్వర్ణరథంపై విహరించిన వినాయకుడు



వ్రతానికి హాజరైన భక్తులు

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 27: కాణిపాకంలో శనివారం సంకటహర గణపతి వ్రతం వైభవంగా నిర్వహించారు. ఆస్థాన మండపంలో నిర్వహించిన ఈ వ్రతానికి వందలాది మంది భక్తులు హాజరయ్యారు. పౌర్ణమి గడచిన నాలుగో రోజున ఈ వ్రతం నిర్వహించడం ఆనవాయితీ. ఈ వ్రతం ఆచరిస్తే సర్వ కష్టాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. ఉదయం మూలవిరాట్‌కు అభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి వ్రతం నిర్వహించారు. రాత్రి సిద్ధిబుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలను స్వర్ణ రథంపై మాడవీధులలో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు విద్యాసాగర్‌రెడ్డి, ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు ఆలయ ఇన్‌స్పెక్టర్లు రమేష్, విఘ్నేష్ పాల్గొన్నారు.



కొలువుదీరిన సిద్ధిబుద్ధిసమేత వరసిద్ధుడు

మరో నాలుగు రోజులు మంటలే

ఆరెంజ్ జోన్‌లోకి చౌడేపల్లి, పుంగనూరు



బోసిపోయిన పుత్తూరు రోడ్డు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 27: ఎండ, వడగాడ్పులతో జిల్లాలోని అనేక ప్రాంతాలు ఉడుకుతున్నాయి. రానున్న నాలుగు రోజులు ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ తెలిపింది. శనివారం చౌడేపల్లి, పుంగనూరు మండలాలు ఆరెంజ్ జోన్‌లోకి వెళ్లాయి. శ్రీరంగరాజపురంలో అత్యధికంగా 42.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే తవణంపల్లెలో 42, చౌడేపల్లి 41.8, పుంగనూరు 41.8, గుడిపాల 41.4, నింద్ర 41.3, విజయపురం 41.3, సోమల 40.9, సదుం 40.8, శాంతిపురం 40.4, పాలసముద్రం, చిత్తూరు, కుప్పం 40.2, ఐరాల, కార్వేటినగరం, నగరి, రొంపిచెర్లలో 39.9 డిగ్రీలుగా నమోదైంది.

వడదెబ్బకు వృద్ధురాలి మృతి



వల్లెమ్మ(ఫైల్ ఫొటో)

విజయపురం, ఏప్రిల్ 27: మండలంలోని గొల్లకండ్రిగకు చెందిన వృద్ధురాలు వల్లెమ్మ(72) శనివారం వడదెబ్బతో మృతి చెందారు. మధ్యాహ్నం ఆమె పన్నూరు సబ్‌స్టేషన్ నుంచి గొల్లకండ్రిగకు వెళుతుండగా ఎండ తీవ్రతకు సొమ్మసిల్లి పడిపోయింది. ఆస్పత్రికి తరలించే లోపే మృతిచెందిందని స్థానికులు తెలిపారు.

హమ్మయ్య.. గండం గట్టెక్కాం..!

స్క్రూటినీలో బయటపడ్డ ప్రధాన పార్టీల అభ్యర్థులు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 27: నామినేషన్ల ప్రక్రియలో ఎటువంటి సమస్యలూ తలెత్తకపోవడంతో పోటీలోని ప్రధాన పార్టీల అభ్యర్థులు ఊపిరి పీల్చుకున్నారు. అధికార వైసీపీ, విపక్ష టీడీపీ-బీజేపీ-జేఎస్పీ, స్వతంత్ర పార్టీల అభ్యర్థులు రెండు నుంచి నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలను సమర్పించారు. అంతేగాక డమ్మీ అభ్యర్థులతో సైతం నామినేషన్ వేయించారు. ఏదో ఒక పొరపాటు జరిగి, నామినేషన్ రద్దయితే రాజకీయ భవిష్యత్తు కోల్పోవాల్సి వస్తుందని భావించి, సతీమణుల పేరిట కూడా పార్టీ తరఫున, ఇండిపెండెంట్లుగా నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని స్క్రూటినీలో తేలడంతో పలువురు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఇక ప్రచారంపై దృష్టి పెట్టారు.



'స్మార్ట్' క్యాంపెయిన్

అభ్యర్థులకిప్పుడు ఇల్లిల్లూ తిరగాల్సిన అవసరం కూడా ఉండడంలేదు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు సైతం జండా భుజాన మోసి అలసిపోనూ అవసరం లేదు. స్మార్ట్ క్యాంపెయిన్ ఊపందుకుంది. అయిదేళ్ల కిందటితో పోలిస్తే ప్రచార వ్యూహాల్లో సోషల్ మీడియా వినియోగం మూడింతలు పెరిగిపోయింది. ఫేస్‌బుక్ లైవ్‌లు ఇప్పుడు ట్రెండ్‌గా మారాయి. ఓ మాదిరి స్మార్ట్ ఫోన్ చేతిలో ఉంటే చాలు.. ప్రచారం హోరెత్తించేస్తున్నారు. కుప్పంలో వైసీపీ రెబెల్‌గా నామినేషన్ వేసిన అధికార పార్టీ సర్పంచి భార్య నీలమ్మ అలియాస్ నీలావతి, ఇటీవల ఫేస్‌బుక్‌లో లైవ్‌లోకి వచ్చేశారు. నియోజకవర్గంలో అయిదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అరాచకాలను ఎండగట్టారు. తనను గెలిపిస్తే పరిశ్రమలు తెచ్చేసి మహిళలు బెంగళూరు వలస వెళ్లకుండా చూస్తానని హామీ ఇచ్చేశారు. మళ్లీ ఈ ఫేస్‌బుక్ లైవ్‌ను వాట్సాప్‌తోపాటు ఇతర సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అవి వైరల్‌గా మారాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులు సైతం ఏదో ఓ సమయంలో వీలు చూసుకుని ఇలా ఫేస్‌బుక్ లైవ్ షోలు చేస్తున్నారు. లేదా తమ ఆలోచనలు, హామీలతో వీడియోలను చేసి సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తున్నారు. స్వతంత్ర అభ్యర్థులు సైతం 'స్మార్ట్'గా విపరీతమైన ప్రచారం కొట్టేస్తున్నారు. ఇక ప్రధాన పార్టీల వీరాభిమానులైతే ఫేస్‌బుక్, ఇన్స్టాగ్రామ్, వాట్సాప్.. ఇలా వారు తమ పార్టీ అభ్యర్థుల ప్రచారంకోసం సామాజిక మాధ్యమాలను వాడుతున్నారు. ఖర్చు తక్కువ.. ప్రచారం ఎక్కువగా జరిగే స్మార్ట్ క్యాంపెయిన్లతో అభ్యర్థులు దూసుకు పోతున్నారు.

- కుప్పం

వెలిగొండ ప్రాజెక్ట్ — వెలుగు

చామంతిపురం రిజర్వాయర్ ఏమైంది స్వామి?

● మూడేళ్లయినా ఊసే లేని వైనం

పూతలపట్టు మండలం చామంతిపురం వద్ద రూ.3 వేల కోట్లతో రిజర్వాయర్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలి. దీంతో చిత్తూరు నగరంతో పాటు పూతలపట్టు, జీడీనెల్లూరు నియోజకవర్గాల్లో ప్రజల దాహార్తి తీరుతుంది.

- 2020 అక్టోబరు 19న చిత్తూరు కలెక్టరేట్‌లో అధికారులతో డిప్యూటీ సీఎం నారాయణస్వామి సమావేశమై ఆదేశించారు.

పూతలపట్టు, ఐరాల మండలాల సరిహద్దులో ఈ చామంతిపురం రిజర్వాయర్‌ను 5 టీఎంసీల సామర్థ్యంతో రూ.3 వేల కోట్లతో నిర్మించాలనుకున్నా.. దీన్ని ప్రభుత్వం అస్సలు పట్టించుకోలేదు. అధికారులు ఎన్నిసార్లు ప్రతిపాదనలు పంపించినా ఫలితం లేదు. దీన్ని నిర్మించి అక్కడికి ఉమ్మడి కడప జిల్లాలోని గండికోట రిజర్వాయర్ నుంచి పైపులైన్ల ద్వారా కృష్ణా జలాలు తెస్తామని.. లేదంటే అడవిపల్లె రిజర్వాయర్ నుంచి వచ్చే నీళ్లతోనైనా నింపుతామన్నారు. వాస్తవానికి జిల్లాలో ఒక్కటీ పెద్ద రిజర్వాయర్ లేదు. ఒక జలాశయం అందుబాటులో ఉంటే నీటిని నిల్వ చేసుకుని, ఎద్దడి పరిస్థితులను ఎదుర్కోవచ్చు. మూడున్నరేళ్లు పూర్తవుతున్నా దీని నిర్మాణానికి సంబంధించి నయా పైసా నిధులు విడుదల కాలేదు. ప్రాథమికంగా సర్వే చేయడానికి రూ.10 కోట్లవుతుందని యంత్రాంగం నారాయణస్వామికి సూచించగా, రూ.5 కోట్లు విడుదల చేయిస్తామని భరోసా ఇచ్చారు. ఫలితం లేదు. రిజర్వాయర్ నుంచి ఒక టీఎంసీ నీటిని చిత్తూరు నగరానికి కేటాయించి.. మరో నాలుగు టీఎంసీలతో పూతలపట్టు, జీడీనెల్లూరు నియోజకవర్గ ప్రజల దాహార్తి తీర్చవచ్చు. అలాగే పూతలపట్టు, జీడీనెల్లూరు నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

- పూతలపట్టు



జన కేతనం

ఆదివారం 28 ఏప్రిల్ 2024

'గత ప్రభుత్వాలు పేదలకు ఇళ్లు నిర్మిస్తే.. నేను ఊళ్లనే నిర్మిస్తాను' అంటూ సీఎం జగన్ చెప్పారు. లబ్ధిదారుల కోసం ఊరికి దూరంగా.. కొన్ని చోట్ల కొండల్లో గుట్టల్లో లే అవుట్లు వేశారు. గ్రామాల్లో ఒకటిన్నర.. పట్టణల్లో సెంటు స్థలాలు ఇచ్చారు. ఇంటికేమో రూపాయి కూడా ఇవ్వలేదు. కేంద్ర నిధులే సరిపెట్టారు. లబ్ధిదారులపై ఒత్తిడి చేసి.. బలవంతంగా ఇళ్ల నిర్మాణం చేయించారు. దీంతో వారంతా అప్పులపాలయ్యారు. జగనేమో తాను ఊళ్లను కడుతున్నానంటూ 'జగనన్న కాలనీ'లుగా పేరు పెట్టుకున్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

పుంగనూరు చరిత్ర

జమీందారుల కోట



పుంగనూరు అంటే జమీందారులు గుర్తుకొస్తారు. ఒకనాడు పాలన సాగించిన రాజకీయ ఉద్దండులూ జ్ఞాపకానికి వస్తారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత నాటి ప్రశాంతత దూరమై.. రాజకీయ కక్షలు, అక్రమాలు, దౌర్జన్యాలతో రాష్ట్రవ్యాప్తంగా పేరు పొందింది. పూర్వపు పుంగనూరు నియోజకవర్గం.. పుంగనూరు, చౌడేపల్లె, సోమల, పెద్దపంజాణి, రామసముద్రం మండలాలతో, 35 కిలోమీటర్లలోపు విస్తీర్ణంతో ఉండేది. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత దీని విస్తీర్ణం 120 కిలోమీటర్లకు విస్తరించింది. తమిళం, కన్నడ ప్రజలూ ఇక్కడ స్థిరపడ్డారు. 1952లో మొదలై ఇప్పటికి 17 మార్లు ఎన్నికలు జరిగాయి. అందులో రెండు ఉప ఎన్నికలు ఉన్నాయి. కాంగ్రెస్‌పార్టీ 9 సార్లు, తెలుగుదేశం పార్టీ ఆరు పర్యాయాలు, వైసీపీ రెండు సార్లు, స్వతంత్ర్య అభ్యర్థి ఒకసారి గెలుపొందారు. 11 మంది ఎమ్మెల్యేలు అయ్యారు. తెలుగుదేశం ఆవిర్భావం తర్వాత జరిగిన ఎన్నికల్లో సామాన్యుడైన బస్సు కండక్టర్ బగ్గిడి గోపాల్ ఎమ్మెల్యేగా గెలుపొందడం గమనార్హం. 1955, 1970, 1972ల్లో ఎమ్మెల్యేలుగా జమిందారీ కుటుంబీకులు ఎన్నికయ్యారు. ఇక, ఎమ్మెల్యేగా, చిత్తూరు ఎంపీగా హ్యాట్రిక్ సాధించిన నూతనకాల్వ రామకృష్ణారెడ్డి రాజకీయ ప్రస్థానం ఈ నియోజకవర్గం నుంచే మొదలైంది. తండ్రీ కొడుకులుగా రామకృష్ణారెడ్డి, అమరనాథరెడ్డి ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. ఈ ఐదేళ్లలో అరాచకాలు, దౌర్జన్యాలు, పోలీసు కేసులు, రౌడీషీట్లు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యర్థులను నామినేషన్లు వేయకుండా పోలీసుల సహకారంతో వైసీపీ శ్రేణులు అడ్డుకోవడం వంటి ఘటనలతో రాష్ట్రవ్యాప్తంగా పేరు పొందింది.

ఎమ్మెల్యేలు వీరే..

- 1952- బాడాల కృష్ణమూర్తి (కాంగ్రెస్)
- 1955- వైజీ.వీరబసవచిక్కరాయులు (స్వతంత్ర)
- 1955- ఎంఎం.రత్నం (కాంగ్రెస్)
- 1962, 1967-వి.రామస్వామిరెడ్డి (కాంగ్రెస్)
- 1970 ఉప ఎన్నిక- బి.రాణీసుందరమ్మణి (కాంగ్రెస్)
- 1972- బి.రాణీసుందరమ్మణి (కాంగ్రెస్)
- 1978- కేవీ పతి (కాంగ్రెస్-ఐ)
- 1983- బగ్గిడి గోపాల్ (టీడీపీ)
- 1985, 1989, 1994 - ఎన్.రామకృష్ణారెడ్డి (టీడీపీ)
- 1996 ఉప ఎన్నిక- ఎన్.అమరనాథరెడ్డి(టీడీపీ)
- 1999- ఎన్.శ్రీధర్‌రెడ్డి (కాంగ్రెస్)
- 2004- ఎన్.అమరనాథరెడ్డి (టీడీపీ)
- 2009- పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి (కాంగ్రెస్)
- 2014, 2019- పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి (వైసీపీ)

మండలాలు: పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల

ఓటర్ల సంఖ్య : 2,37,719
పురుషులు : 1,16,504
మహిళలు : 1,21,210
ఇతరులు : 05

- పుంగనూరు



మోసం గురూ!

ఊళ్లను నిర్మించడమంటే

ఇదేనా జగన్?

- కొండల్లో, గుట్టల్లో లేఅవుట్లు
- మౌలిక వసతుల కరువు
- ఇల్లుకట్టుకున్నా నివాసం ఉండలేక అవస్థలు
- కేంద్రం సొమ్ముతో రాష్ట్ర ప్రభుత్వం సోకులు





జిల్లాకు 73,584 పక్కా గృహాలు మంజూరయ్యాయి. వీటిలో 46,374 పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. మంజూరై నాలుగేళ్లవుతున్నా 3082 మంది లబ్ధిదారులు ఇంకా నిర్మాణాలను ప్రారంభించలేదు. 3560 మంది పునాది గుంతలు తవ్వి వదిలేయగా.. 10,948 మంది పునాదులు వేసుకున్నరు. 5,334 మంది గోడలు.. 4,286 మంది స్లాబులను వేసుకున్నారంతే. ఆసక్తి చూపకపోవడానికి కారణం యూనిట్ కాస్ట్ చాలకపోవడం. టీడీపీ హయాంలో కేంద్రం రూ.1.50 లక్షలు ఇస్తే.. రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష ఇచ్చేది. అప్పటి ధరలకు ఈ రూ.2.5 లక్షలకు అదనంగా మరో రూ.లక్ష వేసుకుంటే ఇల్లు సిద్ధమైపోయేది. ఇప్పుడు.. కరోనా తర్వాత నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోయాయి. ఊళ్లను కడతానన్న జగన్.. తమ ప్రభుత్వ వాటాగా పైసా కూడా ఇవ్వలేదు. కేంద్రం ఇంటికి ఇచ్చే రూ.1.5 లక్షలు, మరుగుదొడ్డికి అందించే రూ.30 వేల ఉపాధి నిధులనే తాను ఇస్తున్నట్లు కలరింగ్ చేస్తున్నారు. ఇప్పుడున్న ధరలతో ఇంటి నిర్మాణానికి కనీసం రూ.6 లక్షలు అవుతోంది. దీంతో పేదలు అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. వడ్డీలు కట్టలేక సతమతమవుతున్నారు.

ఇక్కడ ఇళ్లు కట్టుకునేదెలా?



నగరి పట్టణంలోని పేదలకని ఏడు కిలోమీటర్ల దూరంలోని నాగరాజుకుప్పం, కీలపట్టుల్లో రెండు లేఅవుట్లు సిద్ధం చేశారు. కొండ ప్రాంతంలో ఉండడంతో చాలామంది నిర్మాణానికి చొరవ చూపలేదు. కేంద్రం ఇచ్చే రూ.1.8 లక్షలు కాకుండా, ఒక్కో లబ్ధిదారు వద్ద రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేశారు. వైసీపీకి చెందిన ఇద్దరు కాంట్రాక్టర్లతో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. మరుగుదొడ్లు, గోడలకు పూత పనులు, తలుపులు వంటివి అసంపూర్తిగా వదిలేశారు. ఇవన్నీ పూర్తి చేయాలంటే ఒకొక్కరు రూ.1.80 లక్షలు ఇవ్వాలని కాంట్రాక్టర్లు అడిగినట్లు ఓ మహిళ చెప్పారు. అంత ఇచ్చుకోలేక కొందరు వదిలేశారు. ఈ రెండు లేఅవుట్లలో 3556 ఇళ్లు మంజూరగా, 1978 పూర్తయ్యాయి. ఊరికి దూరంగా ఉండడంతో ఇక్కడ నివాసం ఉండేందుకు భయపడుతున్నారు.

నెరవేరని సొంతింటి కల

జిల్లాలో సుమారు 74 వేల మందికి ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. వీటిని ఆధార్‌తో అనుసంధానం చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కొండల్లో, గుట్టల్లో, ఊరికి దూరంగా ఇచ్చిన స్థలాల్లో ఇళ్లు కట్టుకోలేక.. కట్టుకున్నా నివాసం ఉండలేకున్నారు. ఎందుకంటే.. ఊరికి దూరంగా కాపురం వెళితే బతుకుతెరువు కోసం నిత్యం పట్టణానికి రావాలంటే వ్యయప్రయాసలు కాబట్టి. అందుకని అద్దె ఇళ్లల్లోనే ఉంటున్నారు. ఇళ్లు కట్టుకోకున్నా ప్రస్తుతం వీరు లబ్ధిదారులు కావడంతో.. భవిష్యత్తులో ప్రభుత్వాలు అనువైన చోట ఇళ్ల స్థలాలు ఇచ్చినా.. వీరు అనర్హలవుతారు. ఇలా సొంతింటి కల నెరవేరని పరిస్థితి. అందుని కొందరు లబ్ధిదారులు పనికిరాని పట్టాలు తమకొద్దని, రద్దు చేయాలని కోరుతున్నారు.






అప్పు చేసే స్థోమత లేక..

ఈమె పేరు మేరీ. బంగారుపాళ్యం మండలం ముంగరమడుగు గ్రామం. ఈమెకు పక్కా గృహం మంజూరైంది. తొలుత పునాది బిల్లు రూ.70 వేలు, తర్వాత గోడ బిల్లు రూ.35 వేలు, 50 బస్తాల సిమెంటు వచ్చాయి. అప్పు చేసి స్లాబు వేసుకున్నారు. ఆరు నెలలవుతున్నా బిల్లులు రాలేదు. ఇప్పటివరకు ఇటుకల కోసం రూ.లక్ష, మేస్త్రి కూలి కోసం రూ.1.10 లక్షలు ఖర్చయినట్లు ఆమె తెలిపారు. ఇంకా గోడలకు పూత పని, తలుపులు, కిటికీలు అమర్చలేదు. ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు ఏమాత్రం చాలడం లేదని, మరో రూ.3 లక్షలు చేతి నుంచి పడుతోందని, స్థోమత లేక నిర్మాణం ఆపేసినట్లు ఆమె చెప్పారు.

ఊరికి దూరంగా.. మౌలిక వసతుల్లేక

ఇది వి.కోట మండలం పాపేపల్లి-3 జగనన్న లేఅవుట్. ఇక్కడ 400 మందికి ఇళ్లు మంజూరైతే 50 మంది నిర్మాణాలను పూర్తి చేసుకున్నారు. వీరిలో 30 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ లేఅవుట్ వి.కోటకు మూడు కిలోమీటర్ల దూరంగా.. మెయిన్ రోడ్డు నుంచి కిలోమీటరు లోపలకు ఉంది. దీంతో ఇక్కడ నివాసం ఉండేందుకు మహిళలు భయపడుతున్నారు. ఈ కాలనీలో అంతర్గత రహదారుల్ని నిర్మించలేదు. మౌలిక వసతులు కల్పించలేదు.



వడ్డీలు కట్టలేక..

ఈమె పేరు జయశ్రీ. పెనుమూరు మండలం చిన్నకలికిరి గ్రామం. ఈమెకు పక్కా గృహం మంజూరు కావడంతో రూ.2 లక్షలు అప్పుచేసి చకాచకా స్లాబు వరకు పనులు పూర్తి చేశారు. ప్రభుత్వం నుంచి రూ.70 వేలు పునాది బిల్లు కూడా వచ్చింది. ఆరు నెలలుగా గోడలు, మోల్డింగ్ బిల్లులు రాలేదు. సచివాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేదు. దీంతో ఇంటి తుది మెరుగులు దిద్దలేక, అప్పులకు వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడుతున్నారు.





అసంపూర్తి ఇంట్లోనే నివాసం

ఈమె పేరు సల్మా. వి.కోట మండలంలోని పాపేపల్లి-3 జగనన్న లేఅవుట్‌లో ప్రభుత్వ గృహాన్ని నిర్మించుకున్నారు. రూ.1.80 లక్షల బిల్లు పూర్తిగా వచ్చేసింది. చేతి నుంచి రూ.3 లక్షలు వేసుకుని నిర్మాణం పూర్తి చేసుకున్నారు. మరో రూ.లక్ష ఉంటే తుది మెరుగులు చేసుకోవచ్చు. ఇక అప్పులు చేయలేక వదిలేశారు. ఆ అసంపూర్తిగా ఇంట్లోనే నివాసం ఉంటున్నారు. వి.కోటకు దూరంగా లేఅవుట్ ఉండడంతో రాత్రిళ్లు భయపడుతూ జీవనం సాగిస్తున్నారు.

కుప్పం వర్తమానం

'భువన' సారథ్యం!

నిన్నా మొన్నటిదాకా లో ప్రొఫైల్ మెయిన్‌టైన్ చేశారు. ఎప్పుడైతే తన భర్తను కేసుల్లో ఇరికించి జైలుపాలు చేశారో, అప్పుడు 'నిజం గెలవాలి' పేరుతో లైమ్‌లైట్‌లోకి వచ్చారు. రాష్ట్రమంతా పర్యటించి.. పార్టీ శ్రేణులకు నేనున్నానంటూ ధైర్యం చెప్పారు. ఎన్నికల వేళ చంద్రబాబు బిజీగా ఉండటంతో.. ఆయన తరపున కుప్పంలో పార్టీకి సారథ్యం వహిస్తున్నారు నారా భువనేశ్వరి. హైదరాబాదు నుంచి ఆమె పర్యవేక్షిస్తున్నారు.

- కుప్పం

గతేడాది చివర్లో ఎన్టీఆర్ ట్రస్టు తరఫున క్లినిక్ ప్రారంభోత్సవానికి నారా భువనేశ్వరి కుప్పం వచ్చారు. అప్పుడు రాజకీయాల గురించి అడిగితే వాటి గురించి తనకు తెలియదని చెప్పారు. అదే ఆమె.. 'నిజం గెలవాలి' యాత్రలో భాగంగా గత నెల 20, 21 తేదీలలో ఇక్కడ పర్యటించినప్పుడు రాజకీయాల గురించి మాట్లాడాల్సిన అనివార్య పరిస్థితి స్థానికంగానే కాకుండా, రాష్ట్రమంతటా ఏర్పడింది. చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక గుడుపల్లె మండలంలో ఇద్దరు అభిమానులు చనిపోయారు. ఆ కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ తరఫున రూ.3 లక్షల చెక్కు అందించారు. బాధిత కుటుంబాల బిడ్డల బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. గుడుపల్లె, రామకుప్పం, శాంతిపురం మండలాల్లో అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. మహిళలతో జరిగిన ముఖాముఖిలో పాల్గొన్నారు. వైసీపీ పాలనలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించి టీడీపీ అధికారంలోకి వచ్చాక పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో టీడీపీ అధినేత చంద్రబాబు బిజీగా మారిపోయారు. నారా లోకేశ్ సైతం తీరికలేని పార్టీ కార్యక్రమాలలో తలమునకలయ్యారు. ఈ క్రమంలో చంద్రబాబు నియోజకవర్గ సారథ్య బాధ్యతలను క్రమేణా భువనేశ్వరి తీసుకుంటూ వచ్చారు. తాను నియోజకవర్గానికి దూరంగా ఉంటున్నా అక్కడి నుంచే పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయసాగారు. ఈనెల 19వ తేదీన చంద్రబాబు తరఫున నామినేషన్ వేయడానికి కుప్పం వచ్చారామె. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీకి జనం వేలాదిగా వచ్చారు. రెండు రోజులపాటు మహిళలు, ప్రతిభావంతులు, ముస్లిం మైనారిటీ సోదరులు.. ఇలా ప్రతివర్గంతోనూ ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించారు. వైసీపీ అరాచకాలపై నిప్పులు చెరిగారు. పార్టీ కేడర్‌పై అన్యాయంగా బనాయించిన అక్రమ కేసులను ప్రస్తావించారు. తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. టీడీపీ అధికారంలోకి వస్తే పార్టీలో కష్టపడిన ప్రతిఒక్కరికీ గుర్తింపు ఉంటుందన్నారు. అత్యధిక మెజారిటీ సాధించే పోలింగ్‌బూత్ ఉన్న ప్రాంతాన్ని తాను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని చెప్పారు.

హైదరాబాదు నుంచే పర్యవేక్షణ

హైదరాబాదులో ఉంటున్నా.. కుప్పంలో పరిస్థితులను భువనేశ్వరి తెలుసుకుంటున్నారు. ఇటీవల తంబిగానిపల్లెలో వైసీపీ మూకల దాడిలో గాయపడిన పార్టీ కార్యకర్తలను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ద్వారా ఆమె ఫోనులో పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రతి మూడు నెలలకు ఓసారి కుప్పం వస్తానని అవసరమైతే బాధితుల తరఫున న్యాయపోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. చంద్రబాబు రాష్ట్రమంతా చూసుకోవాల్సి రావడంవల్ల భువనేశ్వరి తన సమయాన్ని కుప్పంలో పార్టీకోసం కేటాయించారు. లక్ష మెజారిటీ లక్ష్యంగా శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారు.



ఈనెల 19న చంద్రబాబు తరపున నామినేషన్ వేసే సందర్భంగా ప్రజలకు అభివాదం చేస్తున్న భువనేశ్వరి (ఫైల్ ఫొటో)

మరోవైపు తన బిజీ షెడ్యూల్‌లో వెసులుబాటు తీసుకుని చంద్రబాబు కూడా ఇక్కడి కేడర్‌ను పలకరిస్తున్నారు. టెలికాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేస్తున్నారు. మొన్న రామకుప్పంలో పోలీసు అధికారి బాధితులను ఫోనులో పలకరించి ధైర్యం చెప్పారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

టీడీపీ ప్రభుత్వం వస్తేనే రాష్ట్రం సుభిక్షం


చిన్నబల్దారులో ప్రచారం చేస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, ఏప్రిల్ 27: టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ఆ పార్టీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, బీజేపీ జిల్లా కార్యదర్శి రాజసింహా, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణలు తెలిపారు. శనివారం రామకుప్పం మండలం గొరివిమాకులపల్లె, సింగసముద్రం పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం చేశారు. టీడీపీని గెలిపించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, జనసేన, బీజేపీ మండల అధ్యక్షులు హరీష్, వెంకటేష్ పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ కుటుంబాలు


పార్టీలో చేరిన వారితో టీడీపీ నేతలు

రామకుప్పం, ఏప్రిల్ 27: రామకుప్పం మండలం గొరివిమాకులపల్లె పంచాయతీ పరకాల కుంటకు చెందిన పలు వైసీపీ కుటుంబాల వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ వైస్ఎంపీపీ చిన్నికృష్ణలు వైసీపీ సానుబూతిపరులైన గోవిందరాజులు, అన్బు, వెంకటేశ్, నీలకంఠం, తిరుమల, పళని, ప్రభాకర్‌లతో బాటు వారి కుటుంబసభ్యులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్, క్లస్టర్ ఇన్‌చార్జీ మహ్మద్‌రఫీ, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గంట్లప్పగౌడు, మాజీ సర్పంచు పెరుమాళ్ పాల్గొన్నారు.

159 మంది వలంటీర్ల రాజీనామా

పలమనేరు, ఏప్రిల్27 : పలమనేరు మున్సిపాలిటీలో శనివారం 159 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. మున్సిపాలిటీలో 12 సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 251 మంది వలంటీర్లు ఉన్నారు. ఇందులో ఆర్‌కే.స్ట్రీట్ సచివాలయం, రంగాపురం సచివాలయం మినహా మిగిలిన 10 సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న 159 మంది మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు.

వైసీపీ ఒత్తిడితోనే వలంటీర్ల రాజీనామా: టీడీపీ


నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

పలమనేరు, ఏప్రిల్27 : పలమనేరు మున్సిపాలిటీలో వైసీపీ నాయకుల ఒత్తిడి వల్లే వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారని తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. వలంటీర్ల రాజీనామాలకు వ్యతిరేకంగా శనివారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం వైసీపీ పట్టణ కన్వీనర్ ఎస్‌కేఎస్ జాఫర్ ఇంట్లో వలంటీర్లను నిర్బంధించి బలవంతంగా రాజీనామాలు చేయించారని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి రాగానే వలంటీర్లకు రూ.10వేతనం ఇస్తామని తమ అధినేత హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అది సహించలేక బలవంతంగా రాజీనామాలు చేయించారని విమర్శించారు. అనంతరం మున్సి పల్ అధికారులకు, పోలీసులకు, నియోజకవర్గ ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ కార్యమంలో టీడీపీ నాయకులు ఆర్బీసీ కుట్టి, నాగరాజు, గిరిబాబు, మున్సిపల్ కౌన్సిలర్లు బీఆర్బీ కుమార్, కిరణ్‌కుమార్, ఖాజాపీర్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పాలిసెట్


మహిళా పాలిటెక్నిక్ కళాశాల కేంద్రం నుంచి పరీక్ష రాసి వెలుపలికి వస్తున్న విద్యార్థులు

పలమనేరు, ఏప్రిల్27 : పలమనేరులో శనివారం పాలిసెట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని కో-ఆర్డినేటర్ డాక్టర్ మొహమ్మద్ తెలిపారు. పలమనేరులో పాలిసెట్ పరీక్షల కోసం ఏర్పాటు చేసిన 5 పరీక్షా కేంద్రాల్లో మొత్తం1464 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి వుండగా 1228 మంది పరీక్షలు రాశారని వివరించారు. 84 మంది గైర్హాజరయ్యారని వివరించారు. ఈ పరీక్షలను పలమనేరు ఆర్డీవో మనోజ్‌రెడ్డి నియ మించిన స్పెషల్ స్క్వాడ్ అధికారులు ఎంఈఓ లీలారాణి, డిప్యూటీ తహసిల్దార్ రుషి వర్మ, షబీనా, ఎస్ఐ శివశంకర్, పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించారు. కాగా ఫలితాలు వచ్చే 10 రోజుల్లో విడుదల కావచ్చని కో-ఆర్డినేటర్ డాక్టర్ మొహమ్మద్ తెలిపారు.

కేఈసీ జాబ్ మేళాలో 338 మంది ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో నిర్వాహకులు

కుప్పం, ఏప్రిల్ 27: కుప్పం ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం కుప్పం ఎడ్యుకేషనల్ సొసైటీ, బీసీఎన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఇందులో 527 మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. వారిలో 338 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు బీసీఎన్ విద్యా సంస్థల అధినేత బీసీ.నాగరాజ్ తెలిపారు. ఈ జాబ్ మేళాలో రీనెక్స్ టెక్నాలజీస్, కాన్సెంట్రిక్స్ దివిత్ టెక్నాలజీస్ క్రై డాస్ టెక్నాలజీస్, ఆక్సిస్, సీటీయం, టాటా, కాపిటల్, టాటా స్ట్రీస్, డెబ్బి, టీసీఎస్ టెక్నాలజీస్, టాటా ఎలక్ట్రానిక్స్ మిత్సుబాసికాల్ వంటి 25 ప్రముఖ ఐటీ, ఫార్మా కంపెనీలు పాల్గొన్నాయి. ఉద్యోగం పొందిన అభ్యర్థులకు నెలకు రూ.15 వేలు మొదలు రూ.45 వేలు వేతనం ఇస్తారని బీసీ.నాగరాజ్ చెప్పారు. నియామక పత్రాలు అందించారు. ఈ మేళాలో కుప్పం ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.సునీల్ రాజ్, ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కరన్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జయకుమార్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఆలయానికి తాళాలు..పోలీసులకు ఫిర్యాదు


పోలీసులకు ఫిర్యాదు చేసిన పొన్నాంగూరు గ్రామస్తులు

కుప్పం, ఏప్రిల్ 27: ఆలయానికి తాళాలు వేసిన వ్యక్తిపై గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామస్తుల కథనం మేరకు.. కుప్పం మండల పరిధిలోని మల్లానూరు పంచాయతీ, పొన్నాంగూరులో చాముండేశ్వరి ఆలయం ఉంది. ఇక్కడ 11 గ్రామాల ప్రజలు కలిసి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలో కొందరు గ్రామస్తులు శనివారం ఆలయాన్ని శుభ్రం చేసేందుకు వెళ్లారు. అయితే శక్తి అనే వ్యక్తి వారిని అడ్డుకున్నాడు. ఇదేమిటని ప్రశ్నిస్తే 'నేను ఊరిపెద్దను.. మీకు అడిగే హక్కు లేదు' అని దుర్భాషలాడాడు. దీంతో ఆలయాన్ని ఆక్రమించేందుకు కొందరు అధికార పార్టీ వారు ప్రయత్నిస్తున్నారని న్యాయం చేయాలని గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు తనిఖీ



కుప్పం రూరల్, ఏప్రిల్ 27: కుప్పం సరిహద్దుల్లో నడిమూరు వద్ద ఉన్న అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును శనివారం ఎన్నికల అబ్జర్వర్ అమిత్ జైన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి సిబ్బందితో మాట్లాడుతూ తమిళనాడు వైపునుంచి వచ్చే వాహనాలను ఎన్నికల నేపథ్యంలో క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. మద్యం, నగదు, బహుమతుల తరలింపుపై ప్రత్యేక నిఘా వేయాలని ఆదేశించారు. నియోజకవర్గ ఎన్నికల అధికారి జి.శ్రీనివాసులు, డీఎస్పీ శ్రీనాథ్ తదితరులు ఈ తనిఖీలలో పాల్గొన్నారు.

రేపటి నుంచి వేసవి శిక్షణ శిబిరం

కుప్పం, ఏప్రిల్ 27: కుప్పంలోని శాఖా గ్రంథాలయంలో ఈ నెల 29 నుంచి జూన్ 7వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి సత్యవాణి తెలి పారు. పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ రోడ్డు సుజ్ఞానంద ఆశ్రమం సమీపంలో గల జిల్లా పరిషత్ ఉర్దూ పాఠశాల ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ జరుగుతుందన్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు చువుతున్న పిల్లలు అర్హులన్నారు. ఈ శిబిరంలో శ్లోకాలు, రామాయణం, మహాభారతం, భాగవతం కథలు, యోగా గురించి వివరిస్తామన్నారు. వివరాలకు 9676124756 అనే ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఇంటికే రూ.4వేల పింఛన్ : అమర్



టీడీపీలో చేరిన రాధా బంగ్లా వాసులు, పెద్దపంజాణికి చెందిన వైసీపీ నాయకులు, మహిళలు

పెద్దపంజాణి, ఏప్రిల్ 27: ఆదర్శవంతమైన అభివృద్ధిని చేసి చూపిస్తానని మాజీ మంత్రి అమరనాథ రెడ్డి తెలిపారు. శనివారం పెద్దపంజాణి మండలం చామనేరు పంచాయతీలో పర్యటించారు. చామనేరు, బండకుంట, గోనుమాకులపల్లె గ్రామాలలో మాట్లాడారు. ఇంటికే రూ.4వేల పింఛను చేరుస్తామన్నారు.సైకిల్ గుర్తుకు ఓట్లేసి అభివృద్ధిని గెలిపించాలని కోరారు. వైసీపీ నాయకులు, మహిళలు, యువత భారీగా పసుపు కండువాలు కప్పుకున్నారు. మాజీ ఎంపీపీ విజయ భాస్కరరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఆనంద, ప్రధాన కార్యదర్శి చలపతి, నాయకులు రామక్రిష్ణ, మురహరి రెడ్డి, మాజీ ఎంపీపీ మురళీకృష్ణ, శివాడి నాగరాజ, నిడిగుంట సుబ్రమణ్యం, విశ్రాంత ఇంటెలిజెన్స్ ఉద్యోగి సుబ్రమణ్యంరెడ్డి, అమరనాథరెడ్డి, రెడ్డెప్ప పాల్గొన్నారు.

పలమనేరు: పలమనేరు రాధాబంగ్లా ఏరియాలో నివసిస్తున్న 50 కుటుంబాల వారు వైసీపీని వీడి మాజీ మంత్రి అమరనాథరెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ కార్యాలయం వద్ద వారికి అమరనాథ రెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

బైరెడ్డిపల్లె: టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని మండలంలోని లక్కునపల్లె పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. సాయంత్రం బైరెడ్డిపల్లెలో ప్రచారం చేశారు. సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, మాజీ ఎంపీపీ కృష్ణవేణి, మాజీ జడ్పీటీసీ రాధమ్మ, నాయకులు జయకుమార్, రఘుచంద్రగుప్తా, చంద్రారెడ్డి, గోవిందస్వామి, భువనచంద్రగౌడు, జనసేన నాయకులు చైతన్యకుమార్, సల్మాన్ పాల్గొన్నారు.

లక్ష మెజారిటీ ఇచ్చి బాబు రుణం తీర్చుకుందాం


ప్రచారం చేస్తున్న రాజ్‌కుమార్ తదితరులు

కుప్పం, ఏప్రిల్ 27: కుప్పం నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసిన చంద్రబాబుకు లక్ష ఓట్లతో మెజారిటీ ఇచ్చి ఆయన రుణం తీర్చుకోవాలని తెలుగుదేశం పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్ అన్నారు. కుప్పం పురపాలక సంఘం 18వ వార్డు పరిధిలోని సోమయ్య వీధి, కోర్టు రోడ్డులో శనివారం సాయంత్రం 'గతం గుర్తు చేసు కుందాం, బాబు రుణం తీర్చుకుందాం' కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పి.గోపీనాథ్, సత్యేంద్రశేఖర్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

కుప్పం, పలమనేరుకు చేరిన ఈవీఎంలు


కుప్పంలో ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌కు చేరుస్తున్న అధికారులు

కుప్పం, ఏప్రిల్ 27: పోలింగ్‌కు అవసరమైన ఈవీఎంలు శనివారం కుప్పం చేరుకున్నాయి. కుప్పంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో వీటిని భద్రపరిచారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈ ఏర్పాటు జరిగింది. ఆర్వో శ్రీనివా సులు, డీఎస్పీ శ్రీనాథ్, సీఐలు పాల్గొన్నారు.

పలమనేరు: ఎన్నికల నిర్వహణ కోసం ఈవీఎంలు పలమనేరుకు చేరుకొన్నాయి. వాటిని పలమనేరు ప్రభుత్వడిగ్రీకళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూంలలో భద్రపరిచారు. పలమనేరు ఆర్‌ఓ మనోజ్‌రెడ్డి, డీఎస్పీ మహేశ్వరరెడ్డి, తహసీల్దార్ రంగనాయకులు, సీఐ చంద్రశేఖర్, పలువురు రెవెన్యూసిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పుంగనూరులో టీడీపీ గెలుపు ఖాయం

సోమల, ఏప్రిల్ 27: రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు అన్నారు. శనివారం సోమలలో ఇంటింటా ప్రచారం చేఆరు. పుంగనూరు ఎమ్మెల్యేగా చల్లా రామచంద్రారెడ్డిని, రాజంపేట ఎంపీగా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పీఎం.మల్లికార్జున, శివశంకర్, మహేంద్రబాబు పాల్గొన్నారు. ● జనసేన మండల అధ్యక్షుడు సూరిశెట్టి నాగభూషణం ఆధ్వర్యంలో గొల్ల పల్లెలో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మురళి, సోమశేఖర్, అభిరాం, మురళీరాజు పాల్గొన్నారు. ● సోమలలో కామిశెట్టి నగేశ్ ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు నియోజక వర్గం బీజేపీ కన్వీనర్ గన్నా మదన్ మోహన్ బాబు, టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు సుబ్రమణ్యం నాయుడు, సూరిశెట్టి నాగభూషణం, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, భాగ్యమ్మ, డాక్టర్ హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల: రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు చంద్రగిరి మనోజ్, పుంగనూరు నియోజకవర్గం ఐ-టీడీపీ అధ్యక్షుడు గూడూరు హరిబాబు మండలంలోని చెంచమరెడ్డిగారిపల్లె పంచాయతీ గ్రామాల్లో టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. నాయకులు రఘు, చంగల్‌రెడ్డి, పురంమల్లయ్య, ద్వారక, ఈశ్వరయ్య, చంద్రాచారి, సురేంద్ర, వెంకటరెడ్డి, కోదండరామిరెడ్డి, శ్రీహరి పాల్గొన్నారు.

చౌడేపల్లె: టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి స్థానిక నాయకులతో కలసి నాగిరెడ్డిపల్లె, కోటూరు, పెద్దకొండామారి తదితర గ్రామాలలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. సూపర్ సిక్స్ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మీపతిరాజు, సుబ్బు, కుమార్ రెడ్డి, అవీద్‌ఖాన్,ప్రదీప్‌రాజు, కార్తీక్, హరి, రాజ పాల్గొన్నారు.

కల్లూరు: పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీలోని బాలిరెడ్డిగారిపల్లి, మునిరెడ్డిగారిపల్లి, తుడుంవారిపల్లి తదితర గ్రామాల్లో చల్లా పూజారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

పుంగనూరు రూరల్: పుంగనూరు నియోజవర్గంలో తెలుగుదేశంపార్టీ గెలవడం ఖాయమని టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఏతూరు పంచాయతీ మర్రిమాకులపల్లె, నల్లగుట్లపల్లె, ఏతూరు గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి ఓటమి భయంతో నూతనకాల్వ శ్రీనాథ్‌రెడ్డి, అనీషారెడ్డిను పార్టీలో చేర్చుకున్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ విజయం సాధించబోతోందననడానికి ఇదే నిదర్శనమన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతినెల రూ.1500 నగదు, ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, రూ.20వేలు రైతు భరోసా ఇస్తామన్నారు. టీడీపీ నాయకుడు వెంకటరమణ రాజు, నాయకులు మాధవరెడ్డి, సీవీరెడ్డి, సుబ్రహ్మణ్యంరాజు, ఆర్వీవీబాబు, శమిపతి, గంగాధర్, కవిత, రెడ్డెప్పనాయుడు, గిరిబాబునాయుడు, ప్రసాద్, వెంకటరమణ, జనసేన నాయకులు చిన్నారాయల్ పాల్గొన్నారు.


మల్లిమాకులపల్లెలో పర్యటిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి


సోమలలో టీడీపీలో చేరిన కామిశెట్టి నగేశ్ తదితరులు


పులిచెర్ల మండలం తుడుంవారిపల్లిలో చల్లా పూజారెడ్డి ప్రచారం

వైసీపీ అరాచకపాలన అంతమే కూటమి లక్ష్యం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం, ఏప్రిల్ 27: వైసీపీ ఐదేళ్ల దౌర్జన్యం, అవినీతి అంతమే టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి లక్ష్యమని ఆ పార్టీల నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు స్పష్టంచేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం జగనాసుర రక్త చరిత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనపై ఎన్డీయే విడుదల చేసిన ఛార్జిషీట్‌పై వారు మాట్లాడారు. జగన్‌రెడ్డి ఎన్నికల ముందు చెప్పిన హామీలలో 85 శాతం నెరవేర్చలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ నిధులను పక్కదారి పట్టించడమేకాక రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారని విమర్శించారు. పారిశ్రామికవేత్తలను భయభ్రాంతులకు గురిచేసి కొత్త పరిశ్రమలను తేకపోవడమేకాక ఉన్న పరిశ్రమలు పారిపోయేలా చేశారన్నారు. మద్యపాన నిషేధం తర్వాతే ఓట్లడుగుతామని చెప్పిన జగన్, ఇప్పుడు ఊరూరా బెల్ట్ షాపులు పెట్టి జనాన్ని ఎలా ఓట్లడుగుతారని నిలదీశారు. మద్యం, ఎర్రచందనం, ఇసుక మాఫియాలు రాజ్యమేలుతున్నాయని ధ్వజమెత్తారు. భూకబ్జాలకైతే అంతే లేదన్నారు. ఇలాంటి దుష్టపాలన పోవాలని చంద్రబాబు నాయకత్వం రావాలని జనం వేయికళ్లతో ఎదురు చూస్తున్నారని చెప్పారు.

ఓటమి భయంతోనే పెద్దిరెడ్డి దాడులు: బీసీవై



చౌడేపల్లెలో రోడ్‌షో నిర్వహిస్తున్న బీసీవై అధినేత రామచంద్రయాదవ్, ఓ వృద్ధుడిని ఓటు అడుగుతున్న రామచంద్రయాదవ్

- ఎన్నికల కోడ్ ఉన్నా పుంగనూరులో పోలీసులు పెద్దిరెడ్డి తొత్తులే
- పెద్దిరెడ్డిని ఇంటికి సాగనంపడానికి ప్రజలు సిద్ధం
- బీసీవై అధినేత రామచంద్రయాదవ్

చౌడేపల్లె, ఏప్రిల్27: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఓటమి భయంతోనే పుంగనూరు నియోజకవర్గంలో బీసీవై, ఇతర ప్రతిపక్షాలపై దాడులు చేస్తున్నారని బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్ పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుంగనూరు మండలంలోని మాగాండ్ల పల్లెలో బీసీవై నాయకుల ప్రశాంతంగా ప్రచారం చేస్తుంటే దాడులు చేశారన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా పుంగనూరు నియోజకవర్గంలో మాత్రం పోలీసులు పెద్దిరెడ్డికి తొత్తులుగా బాధితులపైనే కేసులు పెడు తున్నారన్నాని మండిపడ్డాడు. అయితే నియోజకవర్గం ప్రజలు మాత్రం పెద్దిరెడ్డిని ఇంటికి సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. పుంగనూరులో పెద్దిరెడ్డి దాడులపై తాను ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయటంతో స్పందించిన కమిషన్ కేంద్రబలగాలను పంపించినట్లు వివరించారు. ప్రజలు నిర్భయంగా ఓట్లు వేయాలని కోరారు. ప్రజలు వైసీపీ నాయకులు దౌర్జన్యాలకు విసిగిపోయి మార్పు కోరుకుంటున్నారని అన్నారు. గతంలో జరిగిన స్థానిక ఎన్నికల సమయంలో జరిగిన దాడులు ఒకసారి ప్రజలు గుర్తుచేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలంటే ఇలాంటి దాడులు ఆగిపోవాలని తెలియజేశారు. మన బిడ్డల భవిష్యత్తు సంతోషంగా, ప్రశాంతంగా సాగాలంటే అరాచకాలు ఉండరాదని పేర్కొన్నారు. సామాన్యుడు స్వేచ్ఛగా జీవించాలంటే వైసీపీని ఓడించాలని తెలియజేశారు. పెద్దిరెడ్డిని ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. తనను గెలిపించి ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే ప్రతి రైతుకు ఒక ఆవు ఉచితంగా ఇస్తానని, ప్రతి మండలంలో ఒక పాల డెయిరీ ఏర్పాటు చేసి పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తానన్నారు. పతంజలి వంటి పరిశ్రమలను ఏర్పాటు చేయించి యువతకు 20వేల ఉద్యోగాలు కల్పిస్తామని వివరించారు. చింత పండు, టమాటా పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రత్యేక పారిశ్రామిక వాడను ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని తెలియజేశారు. తనకు చెరుకు రైతు గుర్తుపై ఓట్లు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే పుంగనూరును అభివృద్ధి చేసి, దాడుల, దౌర్జన్యాలను అరికడుతా నన్నారు. పుంగనూరును ప్రశాంతంగా మారుస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరిబాబుయాదవ్, డాక్టర్ మహేష్, సాంబమూర్తి, ఆనంద్, వేణుగోపాల్‌రెడ్డి, గిరిబాబు, సత్య, సుబ్రహ్మణ్యంరెడ్డి, పాల రమేష్ యాదవ్, కిరణ్, ఆనందరెడ్డి, వెంకటేష్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యాధికారి చందనప్రియకు ఉత్తమ అవార్డు



సోమల, ఏప్రిల్ 27: సోమల మండలం పెద ఉప్పరపల్లె పశువైద్యాధికారి ఎం.చందన ప్రియ పశుసంవర్థక శాఖ జేడీ ప్రభాకర్ నుంచి ఉత్తమ అవార్డును స్వీకరించినట్లు ఏడీహెచ్ శ్రీనివాసులు నాయుడు తెలిపారు. శనివారం ప్రపంచ పశు వైద్య దినోత్సవం సందర్భంగా చిత్తూరులో జరిగిన కార్యక్రమంలో ఆమె ఉత్తమ సేవలను గుర్తించి జిల్లా స్థాయిలో అవార్డును ప్రదానం చేశారు.

సదుం గురుకులంలో ప్రవేశ పరీక్షలు

సదుం, ఏప్రిల్ 27: సదుంలోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో అడ్మిషన్ల కోసం శనివారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. గురుకులంలోని 5వ తరగతిలో ప్రవేశం కోసం ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 295 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే శనివారం జరిగిన ప్రవేశ పరీక్షకు 35 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ప్రవేశ పరీక్షను కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి పరిశీలించారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

రామకుప్పం, ఏప్రిల్ 27: గొరివిమాకులపల్లె పంచాయతీ పెద్దగెరిగపల్లె గ్రామానికి చెందిప టీడీపీ కార్యకర్త రామక్క గురువారం మృతిచెందారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, తెలుగుయువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జి మహ్మద్‌రఫీ, మాజీ ఎంపీటీసీ రామిరెడ్డి, మాజీ సర్పంచు పెరుమాళ్ తదితరులు శనివారం ఆమెకు నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబసభ్యులకు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

కుప్పంలో ఉపసంహరణల నిల్

కుప్పం, ఏప్రిల్ 27: కుప్పంలో నామినేషన్ల ఉపసంహరణల మొదటి రోజైన శనివారం నాడు అభ్యర్థులెవరూ తమ నామినేషన్లను ఉపసంహరించుకోలేదు. మొత్తం 15 మంది అభ్యర్థులూ బరిలోనే ఉన్నారు.

ఇంటికి నిప్పుపెట్టిన దుండగులు

సదుం, ఏప్రిల్ 27: సదుం మండలం నడిగడ్డ గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో ఉన్న ఓ ఇంటికి శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు నిప్పుపెట్టారు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది. బాధితురాలు కీర్తన ఫిర్యాదు మేరకు ఎస్ఐ మారుతి ఆ ఇంటిని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేరుశెనగ వామికి నిప్పు

చౌడేపల్లె, ఏప్రిల్27: వేరుశెనగవామికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. ఈ ఘటన చౌడేపల్లె మండలంలో జరిగింది. బాధితుడి కథనం మేరకు.. మండలంలోని పరికిదొన పంచాయతీ దిగువమల్లేవారిపల్లెకు చెందిన నరసింహులు తన పశువుల మేపు కోసం వేరుశనగతీగలను కోనుగోలు చేశాడు. మామిడిమాను సెంటర్ సమీపంలో బండపై రెండు వాములు వేసి నిల్వ ఉంచాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆ వాములకు నిప్పుపెట్టారు. రెండూ కాలిబూడిదయ్యాయి. రూ.30వేలు వరకు నష్టం వాటిల్లింది.

లక్ష్మీ నరసింహుడికి ప్రత్యేక పూజలు

కల్లూరు, ఏప్రిల్ 27: పులిచెర్ల మండలం దేవళంపేటలో కొలువైన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించారు. వివిధరకాల పుష్పాలతో అలంకృతుడైన స్వామివారు భక్తులకు విశేషంగా దర్శనమిచ్చారు. వేడుకలో పాల్గొన్న భక్తులకు అర్చకులు అనంత కుమారాచార్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కన్నులపండువగా..కల్యాణోత్సవం

సదుం, ఏప్రిల్ 27: మండలంలోని బూరగమంద పంచాయతీ పెడకంటివారి పల్లెలోని కోదండ రామస్వామి ఆలయంలో శనివారం స్వామి వారి కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. కళ్యాణోత్సవం సందర్భంగా ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం శాస్త్రోక్తంగా కళ్యాణం జరిపించారు. రాత్రి ప్రత్యేక వాహనంపై సుందరంగా అలంకరించిన స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాలు, కోలాటాలు, చెక్కభజనల నడుమ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

చెన్నకేశవుడికి విశేష పూజలు

సోమల, ఏప్రిల్ 27: సోమల పంచాయతీ చెన్నయ్యగారి పల్లెలో కొలువుదీరిన చెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం స్వామివారి మూల విరాట్‌కు విశేషపుష్పాలంకరణలు చేసి అభిషేక పూజలు జరిపారు. ఉపవాస దీక్షలతో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. సోమల, కరకమంద, నడింపల్లె, అడుసుపల్లె, రాశెట్టివారిపల్లె, దిడ్డివారిపల్లె భక్తులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడి హోటల్‌పై దాడి

● భగ్గుమన్న వైసీపీలోని వర్గ విభేదాలు

పాలసముద్రం, ఏప్రిల్ 27: మండల వైసీపీలోని వర్గవిభేదాలు గుప్పుమన్నాయి. వైసీపీ నాయకుడి హోటల్‌పై, వైసీపీలోని మరోవర్గానికి చెందిన వారు దాడిచేశారు. ఈ ఘటన వివరాలు ఇలా.... మండల వైసీపీ నాయకుడు పద్మనాభ నాయుడు బలిజకండ్రిగ గ్రామానికి సరిహద్దులో తమిళనాడు ప్రాంతంలో ఓ నాన్-వెజ్ హోటల్ నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం వైసీపీలోని మరో వర్గానికి చెందిన గోపి తన అనుచరులతో వెళ్లి రూ.700కు నాన్-వెజ్ ఐటమ్‌లను అప్పు అడగడంతో అందుకు నిరాకరించారు. దీంతో రెచ్చిపోయిన గోపి తన అనుచరులతో పద్మనాభం నాయుడు హోటల్‌లో పనిచేసే గుణశేఖర్, రుక్మిణి, పద్మనాభనాయుడు భార్య సుమతిని చితకబాదారు. ఈ విషయం హోటల్ యజమానికి ఫోన్ ద్వారా తెలపడంతో ఆయన వచ్చి గోపిని తన హోటల్‌పై ఎందుకు దాడిచేశావని నిలదీశారు. దీంతో రెచ్చిపోయిన గోపి అనుచరులు పద్మనాభ నాయుడును కూడా చితకబాదారు. ఘర్షణ వాతావరణం నెలకొనడంతో డయల్ 100కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేశారు. దీంతో పాలసముద్రం పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి ఈ హోటల్ ఉన్న ప్రాంతం తమిళనాడుకు చెందినదని, తమిళనాడులోని పొద్దుటూరుపేటలో ఫిర్యాదు చేయాలని బాధితులకు పోలీసులు సూచించారు. వైసీపీలోని రెండు వర్గాలు దాడిచేసుకోవడంతో ఈ ఘటన గురించి మండలంలో దావనంలా వ్యాపించింది. వైసీపీలోని వర్గవిభేదాలు ఇలా బయటపడడంతో ఆ పార్టీ వైసీపీ ఎంపీ మిధున్‌రెడ్డి పీఏ ఆనంద్ రెడ్డి, వైసీపీ నియోజకవర్గ నేత నారాయణ రెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ తులసీరామ్ తమ పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి ఇలాంటి ఘటనల వల్ల పార్టీపరువు బజారుకెక్కుతుందని, నష్ట నివారణ కోసం దిద్దుబాటు చర్యలు చేపట్టారు. అయితే బాధిత హోటల్ యజమాని మాత్రం తమిళనాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డుకు అడ్డంగా కోదండరాముడి రథం



చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 27: నగరంలోని కోదండ రామాలయ రథం చర్చివీధిలో రోడ్డుకు అడ్డంగా నిలపడంతో నిత్యం ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఈనెల 21న రథోత్సవ సేవను వైభవంగా జరిపారు. అయితే రథాన్ని రోడ్డుకు అడ్డంగా పెట్టడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా ఆలయ అధికారులు, పోలీస్ యంత్రాంగం స్పందించి నగరవాసులకు ఇబ్బందులు కలుగకుండ తగిన చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు

బాలకృష్ణాపురంలో టీడీపీ ప్రచారం



పాలసముద్రం, ఏప్రిల్ 27: మండలంలోని బాలకృష్ణాపురం పంచాయతీ పరిధి గ్రామాల్లో శనివారం టీడీపీ చిత్తూరు పార్లమెంటు కార్యదర్శి వాసు నాయుడు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజలకు మేలు జరుగుతుందని, ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్‌కు, ఎంపీ అభ్యర్థి ప్రసాదరావుకు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని చెప్పి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు, నాయకులు జె.విజయ్‌కుమార్, కేశవులు నాయుడు, సుబ్బానాయుడు, భక్తవత్సలం నాయుడు, వెంకటేష్‌నాయుడు, రవి నాయుడు, అరుళ్‌నాథన్, మగిదాస్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళతా

● సామాజిక కార్యకర్త, న్యాయవాది క్రిస్టిన్



మాట్లాడుతున్న న్యాయవాది క్రిస్టిన్

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 27: అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళతానని బెంగళూరుకు చెందిన సామాజిక కార్యకర్త, న్యాయవాది క్రిస్టిన్ అన్నారు. శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో బడుగు, బలహీన వర్గాలకు అండగా న్యాయసేవలను అందిస్తానని చెప్పారు. ఎవరైనా పౌరులహక్కులకు భంగం కలిగించినా, ఆటంకాలు ఏర్పరిచినా చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఎవరైనా న్యాయ సహాయం కావాలంటే తన ఫోన్ నెంబర్ 8121874255కు కాల్ చేయాలన్నారు. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా సహాయం అందిస్తామన్నారు. సామాజిక కార్యకర్త శోభ పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో సంకటహర చతుర్థి పూజలు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 27: గిరింపేట సత్య సాయి సంస్థాన్‌లో శనివారం ఉదయం సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో భక్తులు భక్తి ప్రపత్తులతో సంకటహర చతుర్థి పూజలు చేసారు. ఈ సందర్భంగా సాయిలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం, సంకటహర పూజలు చేసారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి జిల్లా అధ్యక్షుడు ఎస్. మధుసూదనం, నగర కన్వీనర్ ఆర్. శేషనారాయణ, బి. పాండురంగం, శ్రీకంఠయ్య, గజేంద్రరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పచ్చికాపల్లంలో టీడీపీ నేతల ప్రచారం

వెదురుకుప్పం, ఏప్రిల్ 27: గంగాధర నెల్లూరు టీడీపీ అభ్యర్థి డాక్టర్ వీఎం థామస్, ఎంపీ అభ్యర్థి ప్రసాదరావును గెలిపించా లంటూ శనివారం పచ్చికాపల్లం పంచాయతీ గ్రామాల్లో థామస్ తమ్ముడు నిధి, పార్టీ నియోజకవర్గ పరిశీలకులు రవిప్రకాష్‌నాయుడు తమ కూటమి నాయకులతో ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి పంచిపెట్టారు. టీఎన్‌టీయూసీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు పోటుగారి గంగయ్య, క్లస్టర్ ఇన్‌చార్జిలు పి.మోహన్‌మురళి, కె.చెంగల్రాయరెడ్డి, నాయకులు రజనీకాంత్, వెంకటరమణారెడ్డి, రాజశేఖర్‌వర్మ, భాస్కర్‌నాయుడు, వి.నాగరాజురెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ కాల్ సెంటర్ ప్రారంభం

వెదురుకుప్పం, ఏప్రిల్ 27: ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం తిరుపతి ఐటుయూ సిస్టమ్స్ కార్యాలయంలో కాల్ సెంటర్‌ను ప్రారంభించామని టీడీపీ ఎన్‌ఆర్‌ఐ జీడీనెల్లూరు నియోజకవర్గ కో-ఆర్డినేటరు గురుసాల కిషన్‌చంద్, వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బట్టే చాణిక్యప్రతాప్, ప్రొఫెషనల్ వింగ్(అదనం) రాష్ట్ర కార్యదర్శి ఎంపరాల కుమారస్వామి నాయుడు తెలియజేశారు. ఈ మేరకు వెదురుకుప్పంలో విలేకరులకు వివరించారు. కాల్ సెంటర్ ప్రారంభోత్సవంలో టీడీపీ నేతలు బండి విష్ణువర్ధన్‌రెడ్డి, సంపతి కిరణ్‌యాదవ్, విశ్వనాథరెడ్డి హాజరయ్యారు.

టీడీపీలోకి 10 కుటుంబాల చేరిక



పెనుమూరు, ఏప్రిల్ 27: చార్వాగానిపల్లి మాజీ సర్పంచ్ శారదమ్మతోపాటు మరో 10 కుటుంబాలు టీడీపీలో చేరడంతో మం డల అధ్యక్షుడు రుద్రయ్య నాయుడు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం చార్వాగానిపల్లి పంచాయతీలో ఇంటింటికి తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. సాయంత్రం గోడుగుమాను పల్లిలో థామస్ భార్య శాంతిరెడ్డి, కుమారుడు రోషన్ ప్రచారం చేశారు. కార్యక్రమంలో పరిశీలకులు రవిప్రకాష్‌నాయుడు, పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు కార్జాల అరుణ, హరిబాబునాయుడు, ఈశ్వర్‌నాయుడు, మనోహర్ రెడ్డి, ఇందిరమ్మ, తలారి రెడ్డెప్ప, పరమేశ్వర్‌రెడ్డి, కృష్ణమూర్తినాయుడు, భాస్కర్, అశోక్, షణ్ముగవర్మ, నాదముని, నాగరాజు, ప్రకాష్‌నాయుడు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

పెనుమూరు, ఏప్రిల్ 27: మండలంలోని శాతంబాకం ఉన్నత పాఠశాలలో 2005 వ ఏడాదిలో చదువుకున్న పదవ తరగతి విద్యార్థులు శనివారం తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. ఉపాధ్యాయులను సన్మానించి వారితో గడిపిన మధు క్షణాలను పంచుకున్నారు. కార్యక్రమంలో జ్యోతి, కార్తిక్, జ్యోతీష్‌నాయుడు, నీలకంఠ, శివ, యుగేష్‌తో మరి కొందరు పాల్గొన్నారు.

నగరిని దోచుకున్న రోజాను తరిమికొట్టండి : భాను

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 27: నగరి నియోజకవర్గాన్ని దోచుకున్న మంత్రి రోజాను తరిమికొట్టాలని ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ ఓటర్లను అభ్యర్థించారు. శనివారం పట్టణ పరిధిలోని వినాయకపురం, ముద్దుకృష్ణాపురం, నెత్తం, పుత్తూరు దళితవాడ, ఎన్‌జీవో కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికలు రోజా అహంకారానికి, అవినీతికి నగరి ప్రజల ఆత్మగౌరవానికి మధ్య జరుగుతున్నవని స్పష్టం చేశారు. రోజా మాయమాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని సూచించారు. అనంతరం వైసీపీ ప్రభుత్వ అవినీతి, అరాచకాలు, దౌర్జన్యాలు, దోపిడీపై గాలి భానుప్రకాష్ చార్జ్‌షీట్ విడుదల చేశారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

భోజనం వితరణ



గుడిపాల, ఏప్రిల్ 27: నిరుపేదల ఆకలి తీర్చడానికే అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు అన్నారు. శనివారం జరిగిన అన్నదాన కార్యక్రమానికి ఆయన భోజనం వితరణ చేశారు. టీడీపీ నాయకులు రవి నాయుడు, ప్రతాప్ నాయుడు, అనిల్ కుమార్, బోడెబ్బ నాయుడు, ఐజాక్, రామూర్తి నాయుడు, గోపి, చల్లా, కిట్టు, శివ లింగారెడ్డి, సుధాకర్ యాదవ్, శేఖర్ పాల్గొన్నారు.

ఆలయం వద్ద అన్నదానం

కార్వేటినగరం, ఏప్రిల్ 27: కార్వేటినగరం టీటీడీ వేణుగోపాల స్వామి ఆలయం వద్ద శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఆసక్తి ఉన్న భక్తులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ భక్తులకు సూచించారు.

టీడీపీలో చేరిక



గుడిపాల, ఏప్రిల్ 27: పల్లూరు దళితవాడకు చెందిన బాబు, జయశీలన్, దొరై కుటుంబసభ్యులు శనివారం మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో రవీంద్రారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, గోవింద గౌడ్, రంగారెడ్డి, షణ్ముగ గౌండర్, ఐజాక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని గట్రాళ్ళమిట్ట పంచాయతీలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు.

మహాభారత ఉత్సవాలు

పాలసముద్రం, ఏప్రిల్ 27: మండలంలోని వనదుర్గాపురం, అత్తిమంజేరి గ్రామాల్లో వున్న ధర్మరాజుల ఆలయాల్లో మహాభారత ఉత్సవాలు రెండురోజులుగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలు మే 5వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ ధర్మకర్త కె. వెంకటరమణరాజు పేర్కొన్నారు. పగటిపూట భాగవతారిణి వరలక్ష్మిచే హరికథా కాలక్షేపం, రాత్రి వేంకటేశ్వర నాట్యమండలిచే వీధినాటకాలు నిర్వహిస్తున్నారు. అలాగే ఆముదాల గ్రామంలో కూడా మహాభారత ఉత్సవాలు జరుగుతున్నాయి.

పార్లమెంట్ టీడీపీ కార్యదర్శిగా బొడపాటి



గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 27: పార్లమెంట్ టీడీపీ కార్యదర్శిగా గంగాధరనెల్లూరు మండలం కొత్తవెంకటాపురం గ్రామానికి చెందిన బొడపాటి నరసింహులునాయుడు(బాబునాయుడు)ను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సీ.ఆర్.రాజన్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా నరసింహులునాయుడు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కొత్తవెంకటాపురం, పాతవెంకటాపురం పంచాయతీల్లో టీడీపీ సత్తా ఏమిటనేది నిరూపించి చూపిస్తామన్నారు.

నగరికి చేరిన ఈవీఎం బాక్సులు



నగరి ఏప్రిల్27: చిత్తూరు కలెక్టర్ కార్యాలయం నుంచి నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శనివారం సీఐ సురేష్ ఆధ్వర్యంలో సాయుధ బలగాల బందోబస్తు నడుమ ఈవీఎం బాక్సులను తరలించారు. నగరి నియోజకవర్గంలో గల 231 పోలింగ్ బూత్‌లకు సరిపడా ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. నగరి నియోజకవర్గ ఎన్నికల అధికారి వెంకటరెడ్డి, డీఎస్పీ నరసింహమూర్తిల పర్యవేక్షణలో ఈవీఎంలను భద్రపరిచి బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్షయవ్యాధిపై అవగాహన

గుడిపాల, ఏప్రిల్ 27: క్షయవ్యాధిని అవగాహనతో అంతం చేయవచ్చని అడిషినల్ డీఎంహెచ్‌వో వెంకటేశ్వర రావు అన్నారు. శనివారం 190 రామాపురం సీఎంసీలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రి నర్సింగ్ కాలేజ్ మేనేజ్‌మెంట్ టీబీపై అవగాహన సదస్సు నిర్వహించారుఆయన అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ కార్యక్రమం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీఎంసీ సంస్థ డైరక్టర్ కెన్నీ డేవిడ్, డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



గుడిపాల, ఏప్రిల్ 27: మండలంలోని రామభద్రాపురంలో ఉభయదారులు గోళ్ళ హరిప్రసాద్ చౌదరి కుటుంబసభ్యులు సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముట్టుకూరుపల్లిలో సీతారాముల చిత్రపటాలను అలంకరించి పుష్పపల్లకిలో మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం, మహిళలకు పసుపు, కుంకుమ, బొందారాలు పంపిణీ చేశారు.

బేల్దార్ హత్యలో నిందితుడి అరెస్టు

చిత్తూరు, ఏప్రిల్ 27: కేరళకు చెందిన బేల్దార్ ఆసీఫ్‌ను హత్య చేసిన నిందితుల్లో ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు రెండో పట్టణ సీఐ ఉలసయ్య తెలిపారు. మూడు రోజులక్రితం బేల్దార్ పనిచేసుకుంటూ తోటపాళ్యంలో నివాసముంటున్న ఆసీఫ్‌ను తనతోపాటు పనిచేసే పవన్, బద్రిలు కలిసి మద్యం దుకాణం వద్ద ఫోన్ కోసం ఘర్షణ పడ్డారు. ఇంటికొచ్చిన ఆసీఫ్‌ను పవన్, బద్రిలు ఆటోలో వచ్చి బీర్‌బాటిల్‌తో దాడిచేసి పరారయ్యారు. ఈ దాడిలో ఆసీఫ్ అక్కడికక్కడే మృతిచెందాడు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితుల్లో ఒక్కరైన పవన్‌ను శుక్రవారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

నారాయణ స్వామి దళిత ద్రోహి

జీడీ నెల్లూరు టీడీపీ అభ్యర్థి డాక్టర్ థామస్



కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 27: కులాల మధ్య చిచ్చు పెడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామిని ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని గంగాధర నెల్లూరు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ ధ్వజమెత్తారు. శనివారం నెలవాయి, ఎస్‌ఆర్ పురం గ్రామ పంచాయతీలలో టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా థామస్ సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి దళిత ద్రోహి అని, ఏనాడు దళితుల అభివృద్ధికి కృషి చేయలేదని విమర్శించారు. ఓట్లు అడిగే అర్హత కోల్పోయిన నారాయణస్వామిని, ఆయన కుమార్తె కృపాలక్ష్మిని చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. జరగబోవు సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీలకు రెండు ఓట్లను సైకిల్ గుర్తుపైనే వేయాలని థామస్ ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో థామస్ కుమారుడు రాహుల్, జనసేన ఇన్‌చార్జి డాక్టర్ పొన్న యుగంధర్, చిట్టిబాబు నాయుడు, రాజేంద్ర నాముడు, రుద్రప్పనాయుడు, విజయ్‌కుమార్, శ్రీనివాసులు నాయుడు, కుమార్, రవినాయుడు, దేవరాజులు నాయుడు, జానకీపతి నాయుడు, నీరంజన్‌రెడ్డి, హేమాద్రి యాదవ్, సిద్దయ్యశెట్టి, బాబు నాయుడు, భాస్కర్ నాయుడు, గురునాథం, రవి, తయ్యారు లోకేష్, నాగారాజు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

గంగాధరనెల్లూరు : ఆంధ్రరాష్ట్రానికి మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి అయి పరిపాలన సాగిస్తేనే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని పలువురు టీడీపీ నేతలు పేర్కొన్నారు. గంగాధరనెల్లూరు మండలం బంగారెడ్డిపల్లె, చిన్నవేపంజేరి పంచాయతీల్లో టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్‌ను సైకిల్ గుర్తుపై ఓట్లువేసి గెలిపించాలని కోరుతూ నేతలు ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు వెంకటేష్, జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, జిల్లా తెలుగుయువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి రాంబాబురెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు స్వామిదాస్, పార్లమెంట్ టీడీపీ ఎస్సీసెల్ ప్రధానకార్యదర్శి దేవసుందరం, పార్లమెంట్ టీఎన్ఎస్ఎఫ్ అధికార ప్రతినిధి కేతినేని లోకేష్‌నాయుడు, టీడీపీనేతలు నరసింహులునాయుడు, రామచంద్ర నాయుడు, వెంగమనాయుడు, నటరాజ్‌మొదలి, రామ్‌ప్రసాద్, ప్రకాష్, దేవరాజులు, మండల జనసేన అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, జనసేన నేతలు ఉదయకుమార్‌రెడ్డి, సురేంద్రరెడ్డిలతో పాటు టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు టీమ్‌సభ్యులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్‌ను గెలిపించాలని కోరుతూ థామస్ సతీమణి శాంతిరెడ్డి(అన్నకిళి), కుమారుడు రోషన్‌లు కోరారు. మండలంలోని చిన్నవేపంజేరి దళితవాడలో శనివారం తల్లి, కుమారులు కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

గురజాల జగన్మోహన్



పేయనపల్లిలో మాట్లాడుతున్న గురజాల జగన్మోహన్

గుడిపాల, ఏప్రిల్ 27: తన సొంత మండలమైన గుడిపాలను ఆదర్శమండలంగా తీర్చిదిద్దుతానని చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ అన్నారు. శనివారం మండలంలోని పేయనపల్లి, శ్రీరంగంపల్లి పంచాయతీల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడిపాలలో పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయడమే కాకుండా నిరుద్యోగులైన యువతీయువకులకు ఉపాధి కల్పిస్తామన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే అర్హులైన ప్రతిఒక్కరికీ సూపర్‌సిక్స్ పథకాలను అందజేస్తామన్నారు. అఖండ మెజార్టీతో తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, బీజేపీ అధ్యక్షుడు ధనుంజయ నాయుడు, జనసేన అధ్యక్షుడు రూప్‌కుమార్, మండల టీడీపీ ఉపాధ్యక్షుడు అనిల్ కుమార్, టీడీపీ నాయకులు ప్రతాప్ నాయుడు, జయచంద్ర నాయుడు, లోక నాథం నాయుడు, బోడెబ్బ నాయుడు, పళని, జయచంద్ర గౌడ్, బాలసుబ్రహ్మణ్యం యాదవ్, రెడ్డెప్ప, గుర్రప్ప నాయుడు, అరుణ్ పాల్గొన్నారు.

టీడీపీతోనే అసలైన సంక్షేమం

చిత్తూరు సిటీ : టీడీపీతోనే ప్రజలకు అసలైన సంక్షేమం లభిస్తుందని మాజీ మేయర్ కటారి హేమలత, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ సతీమణి ప్రతిమ అన్నారు. శనివారం నగరంలోని 4, 33, 34, డివిజన్ల పరిధిలోని గంగనపల్లె , కన్నయ్య నాయుడు కాలనీ, బాలాజి కాలనీ, నజీర్ కాలనీ, కట్టమంచి ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళాభివృద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను, వైసీపీ ప్రభుత్వం సాగిస్తున్న అరాచక పాలనను ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావులకు ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వరదరాజులు, నేతలు కటారి లావణ్య, గోపి, కిషోర్, ఉదయ, లీలావతి, నీరజ, దుర్గ కవిత తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే సీకే బాబు తనయుడు సీకే సాయి కృష్ణారెడ్డి నగరంలోని 3వ డివిజన్ పరిధిలోని దొడ్డిపల్లెలో ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ , కో ఆప్షన్ మెంబర్ నళిని తిరుకుమరన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన



దాసరాపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న మురళీ మోహన్

యాదమరి, ఏప్రిల్ 27: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలపై పూతలపట్టు కూటమి ఉమ్మడి అభ్యర్థి మురళీమోహన్ ప్రజలకు అవగాహన కల్పించారు. శనివారం మండలంలోని దాసరాపల్లె, కృష్ణంపల్లె పంచాయతీల్లో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. అంతకు ముందు యాదమరి వినాయకస్వామి ఆలయంలో పూజలు చేసి బయలు దేరారు. అనంతరం దాసరాపల్లె, కృష్ణంపల్లె పంచాయతీల్లో ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్‌తో కలిసి మురళీమోహన్ పర్యటించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజాసమస్యలను పట్టించుకోని అసమర్థ నాయకులకు ఓటు వేసి మోసపోయామని, ఈసారి విద్యావంతుడైన మురళీమోహన్, దగ్గుమళ్లకు ఓట్లు వేస్తామని ప్రజలు ముక్తకంఠంతో చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రధానకార్యదర్శి కోదండయాదవ్, నియోజకవర్గ పరిశీలకులు బొమ్మనశ్రీధర్, ఎన్నికల పరిశీలకులు జనార్ధన్‌రావు, జడ్పీ మాజీ చైర్మన్ గీర్వాణిచంద్రప్రకాష్, మండల పార్టీ అధ్యక్షుడు మురార్జీ, ప్రధాన కార్యదర్శి రబి, జిల్లా కార్యదర్శి హేమగిరి, మండల మాజీ కన్వీనర్ వినాయకం గౌండర్, క్లస్టర్ ఇన్‌చార్జి నాగరాజు, నేతలు రవి మొదలియార్, గుణశేఖర్, కిరణ్‌రాయల్ పాల్గొన్నారు.

బంగారుపాళ్యం : టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు, పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్‌లను గెలిపించుకోవాలని పారిశ్రామికవేత్త ఎన్‌పీ నవీన్ చౌదరి అన్నారు. శనివారం నలగాంపల్లె పంచాయతీ పీడీవీ కండ్రిగలో ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. అలాగే మొగిలివారిపల్లెలో జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కోకా ప్రకాష్‌నాయుడు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌నాయుడు, రామభద్రనాయుడు, చిన్నయ్య, గిరిబాబు, లోకేష్ నాయుడు, విజయ్, క్రిష్ణకుమారిలు పాల్గొన్నారు.

చెరకు రైతులను ఆదుకుంటాం : గాలి భాను



సమావేశంలో మాట్లాడుతున్న గాలి భానుప్రకాష్

విజయపురం, ఏప్రిల్ 27: నేతమ్స్ చెరకు కర్మాగారం పరిధిలోని చెరకు రైతులను ఆదుకుంటామని నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని కళియంబాకంలో నేతాజీ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్లపాటు చెరకు రైతులను పట్టించుకోకుండా కమీషన్ వ్యాపారం చేసుకుంటూ రైతులను ముంచేశారని, టీడీపీ అధికారంలోకి రాగానే ప్రతి చెరకు రైతుకు బకాయిలను చెల్లించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆవుల శ్రీనివాస్‌యాదవ్, కోశాధికారి రఘునాధరెడ్డి, సభ్యులు సుదర్శన్‌నాయుడు, బీజేపీ కిసాన్‌మోర్చా నాయకులు చంద్రశేఖర్‌నాయుడు, హరిబాబు చౌదరి, అరుణ, జ్యోతీశ్వరి పలువురు టీడీపీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నగరి : టీడీపీ నగరి పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు ఆధ్వర్యంలో శనివారం నగరి రైల్వేస్టేషన్, నత్తం, నత్తంకండ్రిగ, నత్తం దళితవాడలలో ప్రచారం నిర్వహించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక అరాచకాలు పెరిగిపోయాయని, బడుగు బలహీనవర్గాల వారిపై దాడులు పెరిగాయని ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేంద్రబాబు, గోపి, జయచంద్ర, సతీష్ నాయుడు, రమేష్, శివకుమార్, మురళీ ప్రసాద్, బాలనాయుడు, గంగాధరం, చంద్రయ్య, అధికారప్రతినిధి జ్యోతినాయుడు, గుణశేఖర్, రొక్కం బాలాజీ, శ్రీధర్, మదన్‌కుమార్, శ్రీనివాసులు, మణికంఠం, వెంకటరమణ, బోపీనాథ్, మణి, అనిల్‌కుమార్ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మనసును జయించినవాడే నిజమైన విజేత

ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు



కార్యక్రమంలో పాల్గొన్న నగరవాసులు, (ఇన్‌సెట్‌లో) ప్రవచనాలు చేస్తున్న గరికపాటి నరసింహారావు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 27: సృష్టిలో శత్రుత్వంతోనే మిత్రుత్వం ఉద్భవించిందని, దాంతోనే రాగద్వేషాలు, ఈర్ష్య, అసూయలు మనుషులకు అలవడ్డాయిని, అయినా చివరకు వారు పరిపూర్ణత చెంది మనసును జయించిన వారే యుగ పురుషులు అని ప్రముఖ ఆధ్యాత్మిక అంశాల ప్రవచనకర్త గరికపాటి అన్నారు. స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో గత రెండు రోజులుగా నారాయణ సేవాసమితి ఆధ్వర్యంలో గరికపాటి నరసింహారావు భక్త చింతామణి శతకంపై భక్తులకు ప్రవచనాలు నిర్వహిస్తున్నారు. శనివారం ఆయన ప్రవచానాలు చేస్తూ ప్రతి వ్యక్తి ప్రశాంతంగా జీవించాలనుకుంటాడని, అయితే అనుకోని అవాంతరాలు ఏర్పడి జీవితమనే సుడిగుండంలో అనేక ఒడుదొడుకులు ఎదుర్కొని చివరకు బంధనాలు తెంచుకోలేక, తనువు చాలించలేక, ఇంకా ఏదైనా సాధించాలనే తపనతో జీవితాన్ని ముగిస్తారన్నారు. అయితే యోగులు, సాధువులు, పీఠాధిపతులు ఇవేమి లెక్కచేయకుండా సమాజానికి ఏదైతే పనికి వస్తుందో దానిని వివరించి దుర్మార్గులను సన్మార్గులుగా తీర్చిదిద్దుతారనాన్నరు. వీటన్నిటిని విపులీకరించి వడ్డాది సుబ్బరాయ కవి రచించిన భక్త చింతామణి శతకం నేటి జీవన ప్రమాణాలకు ఆదర్శమని ఆయన కొనియాడారు. నారాయణి ట్రస్టీ పీఆర్వో కళ్యాణ చక్రవర్తి, హరి కరుణ, మునీంద్ర, భక్తులు పాల్గొన్నారు.

దళితులను దగా చేసిన సీఎం జగన్



మాట్లాడుతున్న పాలేటి మహేశ్వరరావు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 27: సీఎం జగన్ దళితులను నిలువునా దగా చేశారని సమాతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది పాలేటి మహేశ్వరరావు ఆరోపించారు. శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులపై దాడులు పెరిగాయని చెప్పారు. నా ఎస్సీలు, నా బీసీలు, నా మైనార్టీలు అని చెప్పుకునే జగన్ వారికే అన్యాయం చేస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, సీఎం అనుసరిస్తున్న ఏకపక్ష పోకడలను ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు బనాయించడం, వేధించడం, చివరకు వారి ప్రాణాలను తీయడానికి కూడా వెనుకాడటంలేదన్నారు. ఎర్రచందనం స్మగ్లర్‌ను చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలపడం సీఎం అసమర్థతకు, అరాచకాలకు నిదర్శనమని చెప్పారు.